మంగళవారం
18-06-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 357
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నేడు ఉ.కొరియాకు పుతిన్

ప్యాంగ్‌యాంగ్: దక్షిణ కొరియాతో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన వేళ్ల... దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ ఆహ్వానం మేరకు జూన్ 18- 19 తేదీల్లో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తర కొరియాలో పర్యటించనున్నట్లు ఆ దేశ మీడియా తెలిపింది. అంతర్జాతీయంగా రెండు దేశాలపై కఠిన ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఒకవైపు... ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తోంది. మరోవైపు... ప్యాంగ్‌యాంగ్ ఆయుధ పరీక్షలు, ఇతర దుందుడుకు చర్యలకు పాల్పడుతోంది. ఈ పరిణామాల నడుమ... పుతిన్, కిమ్ భేటీ ప్రాధాన్యం సంతరించుకోనుంది. ఉత్తర కొరియాలో పుతిన్ పర్యటించడం 24 ఏళ్లలో ఇదే తొలిసారి. గత ఏడాది సెప్టెంబరులో కిమ్ జోంగ్ ఉన్ రష్యాలో పర్యటించడం యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.



కిలో రూ. 100

మండుతున్న టమాటా

న్యూఢిల్లీ: వర్షాకాలం ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో టమాటా దిగుబడి భారీగా తగ్గింది. మార్కెట్లో సరిపడినంత నిల్వలు లేకపోవడంతో దేశవ్యాప్తంగా అనేక చోట్ల టమాటా ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. తీవ్రమైన వేడిగాలుల కారణంగా గడిచిన 20 రోజుల్లో మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో టమాటా ధరలు రెండింతలు పెరిగి కిలో రూ.50 వద్ద స్థిరపడ్డాయి. తెలంగాణలో కిలో టమాటా ధర రూ.80కి పైగా పలుకుతోంది. ఉత్తర భారతదేశంలో ధరలు స్థిరంగా ఉన్నాయి. సరఫరా

- మిగతా 2 లో

రెండు రైళ్లు ఢీ

- 9 మంది మృతి... 41 మందికి గాయాలు
- గాల్లోకి లేచిన బోగీ... పట్టాలు తప్పిన మరో రెండు బోగీలు
- బెంగాల్‌లో ఘోర ప్రమాదం
- కాంచనగంగ ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొట్టిన గూడ్స్

న్యూజల్పాయ్‌గురి/కోల్‌కతా: పశ్చిమబెంగాల్ డార్జిలింగ్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. న్యూజల్పాయ్‌గురి సమీపంలో కాంచనగంగ ఎక్స్‌ప్రెస్‌ను వెనక నుంచి ఓ గూడ్స్ రైలు బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 9 మంది

- మిగతా 2 లో

రాత మార్చిన రాజీనామా!

- ఎన్నికల ముందు మూకుమ్మడిగా...
- లబోదిబోమంటున్న వలంటీర్లు
- మా ఉద్యోగాలు మాకే ఇవ్వాలంటూ వినతులు
- రూ.10 వేల గౌరవ వేతనం పెంపుతో ఆశలు
- చేతులెత్తేసిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ మార్పుతో రాజీనామాలు చేసిన వలంటీర్లు లబోదిబోమంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టింది. గ్రామ, వార్డు సచివాయాలకు అనుబంధంగా వలంటీర్లు విధులు నిర్వహించి సంక్షేమం, ప్రజాసేవల్లో ప్రధాన భూమిక పోషించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో వలంటీర్లను విధులకు దూరం ఉంచడంతో వారి సేవలు రెండు, మూడు నెలలుగా నిలిచిపోయాయి. వలంటీర్లు లేని లోటు ఇంటింటా పెన్షన్ల పంపిణీలోనూ కనిపించింది. అవ్వాతాతలు ఇబ్బందులకు గురయ్యారు. ఎన్నికలకు ముందు చాలా నియోజకవర్గాల్లో వలంటీర్లు వైసీపీ నేతల హామీలను నమ్మి తమ పదవులకు మూకుమ్మడిగా రాజీనామాలు చేసి నిండా మునిగినట్లు వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం వలంటీర్లకు రూ.ఐదు వేల చొప్పున గౌరవ వేతనం ఇచ్చింది. ఎన్నికల ముందు కూటమి తరపున టీడీపీ, జనసేన ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోలో వలంటీర్లకు రూ.10వేల గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రావడం, చంద్రబాబు సీఎంగా, పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా అయ్యారు. ఎన్డీఏ ఉమ్మడి కూటమి సమావేశంలోను మనం మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన అవసరముందని పవన్ కల్యాణ్ నొక్కిచెప్పారు. అధికారంలోకి వచ్చిన కూటమి

- మిగతా 2 లో

పోలవరం విధ్వంసం

- పరిస్థితి చూస్తే బాధ, ఆవేదన కలుగుతోంది
- 72 శాతం పూర్తిచేసిన ప్రాజెక్టును ప్రశ్నార్థకంగా మార్చారు
- డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాంలకు తీవ్ర నష్టం చేశారు
- ఈ ఘోర తప్పిదానికి ఎవరు బాధ్యత వహిస్తారో తేలాలి
- క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించిన సీఎం చంద్రబాబు
- రెండు గంటలు ప్రాజెక్టు సైట్‌లో పర్యటన, సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో ఏలూరు: ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును మాజీ సీఎం జగన్ మూర్ఖత్వం, అహంకారంతో సర్వనాశనం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలవరం ప్రస్తుత పరిస్థితిని చూస్తే బాధేస్తోందని, ప్రాజెక్టుకు జరిగిన నష్టం చూస్తే జగన్ రాజకీయాల్లో ఉండకూడని వ్యక్తి అని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. నాటి ప్రభుత్వం విధ్వంసానికి పోలవరం ఒక కేస్ స్టడీ లాంటి దన్నారు. పోలవరం విషయంలో జగన్ క్షమించ రాని తప్పు చేశారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబునాయడు తొలిసారి పోలవరం ప్రాజెక్టును సోమవారం పరిశీలించారు. ఉదయం 11.40కి ప్రాజెక్టు సమీపాన ఉన్న హెలిప్యాడ్ వద్దకు చంద్రబాబు చేరుకున్నారు. మంత్రులు, జలవనరుల శాఖ అధికారులు, జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. వ్యూ పాయింట్ నుండి ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో కలియదిరిగి ప్రాజెక్టు వద్ద పరిస్థితిని చూశారు. స్పిల్ వే, కాఫర్ డ్యాం, డయాఫ్రం వాల్‌తో పాటు 22, 23 గేట్ల దగ్గర నుండి ప్రాజెక్టును పరిశీలించారు. ఎడమగట్టు దగ్గర కుంగిన గైడ్ బండ్ ప్రాంతానికి వెళ్లారు. గ్యాప్-3 ప్రాంతం, ఎగువ కాఫర్ డ్యాం ప్రాంతాన్ని పరిశీలించారు. మొత్తం ప్రాజెక్టును నిశితంగా పరిశీలించిన సీఎం... అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డయా ఫ్రం వాల్ దెబ్బతిన్న ప్రాంతాన్ని సందర్శించారు. అధికారులతో సమీక్ష నిర్వహించాక చంద్రబాబు విలేకరులతో మాట్లాడుతూ... అయిదేళ్ల తన కష్టాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేశారంటూ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు.

టీడీపీ హయాంలో 72 శాతం పనులు పూర్తి

'పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానం చేసుకోగలిగితే రాష్ట్రానికి కరువు అనేది లేకుండా చేయొచ్చని భావించాం. 45.72 మీటర్ల ఎత్తుతో 194 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేలా ప్రాజెక్టుకు డిజైన్ చేశాం. 194 టీఎంసీల నీళ్ల ప్రాజెక్టులో నిల్వ ఉంచుకుంటే వరద నీటితో కలిపి 320 టీఎంసీల నీటిని వాడుకోవడానికి వీలవుతుంది. తద్వారా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు రాయలసీమకు ఈ నీటిని ఇవ్వొచ్చు. ప్రాజెక్టులో నిల్వ చేసిన నీటిలో 99 శాతం వాడుకునే అవకాశం ఉంది. 2014-19 మధ్య 72 శాతం మేర పనులు పూర్తి చేశాం. గతంలో నేను సీఎంగా మొత్తం 30 సార్లు ప్రాజెక్టును సందర్శించా. ఇప్పుడు మళ్లీ 31వ సారి వచ్చాను. నా మనసంతా ప్రాజెక్టుపైనే ఉండేది.కానీ ప్రాజెక్టు కోసం నేను పడ్డ కష్టాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేశారు. భూ సేకరణలో కూడా బాధితులను ఒప్పించి ముందుకు వెళ్లాం. కానీ వైసీపీ ప్రభుత్వం రాగానే రివర్స్ టెండర్ అంటూ ఏజెన్సీని, అధికారులను మార్చారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రెండుసార్లు వచ్చిన వరదలతో డయాఫ్రం వాల్ నాలుగు చోట్ల 35 శాతం దెబ్బతింది. ప్రభుత్వం దీన్ని కాపాడలేపోయింది. డయాఫ్రం వాల్‌పై గతంలో మేం ఖర్చు చేసింది రూ.446 కోట్లు అయితే...జగన్ నిర్వాకం వల్ల ప్రస్తుతం రిపేర్లు చేయడానికి రూ.447 కోట్లు అవుతుంది. అయినా పూర్తిస్థాయిలో బాగవుతుందనే నమ్మకం లేదని అధికారులు చెపుతున్నారు. రెండో ప్రణాళిక ప్రకారం సమాంతరంగా కొత్త డయాఫ్రం వాల్ కట్టాలంటే రూ.990 కోట్లు ఖర్చు అవుతుంది. ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డ్యామ్ రూ.550 కోట్లతో నిర్మాణం జరిగింది. అయితే గత ప్రభుత్వం నిర్వాకంతో చివర్లో ఉన్న గ్యాప్ పూర్తి చేయకపోవడంతో తీవ్ర నష్టం జరిగింది, గైడ్ బండ్ కూడా కుంగిపోయింది. ఇవన్నీ చక్కదిద్దాలంటే ఎన్ని వేల కోట్లు కావాలో ఇప్పటికీ అధికారుల వద్ద నిర్దిష్టమైన లెక్కలు లేవు. 2019 నుండి ఏజెన్సీలను మార్చకుండా పనులు కొనసాగి ఉంటే 2020 చివరి

- మిగతా 2 లో



24 నుంచి అసెంబ్లీ సమావేశాలు

8లో

ఇదీ లోకం!

మీరు గెలవడానికి అసలు కారణం ప్రజలు సార్! గుళ్ళు గోపురాలేనా లేదా వాళ్లని కూడా ఒకసారి కలుస్తారా?!

జగన్ భద్రత కుదింపు

- తాడేపల్లి రోడ్డులో ఆంక్షల తొలగింపు
- ఉండవల్లి నుంచి మంగళగిరికి రాకపోకలు
- మాజీ సీఎం నివాసం వద్ద ప్రైవేట్ సిబ్బంది

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు భద్రత కుదించినట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయంతో ఆయన సాధారణ భద్రతకే పరిమితం కానున్నారు. దీంతో ఆయనకు మాజీ సీఎం స్థాయి తరహాలోనే ఇక నుంచి భద్రత కొనసాగనుంది. తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి జగన్ భద్రత కోసం ప్రైవేట్ సిబ్బంది రావడంతో... ప్రస్తుతం ప్రభుత్వ పరంగా ఉన్న భద్రత కుదించినట్లుగా వస్తున్న ప్రచారానికి బలం చేకూరుతోంది. మరోవైపు ఇంతకాలం తాడేపల్లిలోని జగన్ నివాసం మీదుగా ఉన్న రహదారిపై ఉన్న ఆంక్షలను ప్రభుత్వం ఎత్తివేసింది. దీంతో ఉండవల్లి నుంచి మంగళగిరికి జగన్ ఇంటి ముందుగా ఉన్న రహదారిపై పెద్దఎత్తున రాకపోకలు కొనసాగుతున్నాయి. ఎన్నికల ఫలితాల వరకు సీఎం హోదాలో జగన్ ఉండగా... ఆయన ఇంటి ముందు నుంచి ఎలాంటి వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించలేదు. జగన్ నివాస ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా ప్రకటించారు. సామాన్యులకు అనుమతివ్వలేదు. జగన్ నివాసం

- మిగతా 2 లో

ఆర్థిక శాఖ కార్యదర్శికి ఝలక్!

బాధ్యతల నుంచి తప్పుకోవద్దు: సీఎస్ ఆదేశం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణకు రాష్ట్ర ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. బాధ్యతల నుంచి తప్పుకోవద్దని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆయనకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడడంతో మూడురోజుల క్రితం సత్యనారాయణ నేరుగా నార్త్ ఈస్ట్రన్ రైల్వేలో చేరిపోయారు. రైల్వే ఉన్నతాధికారులు సైతం ఆయనకు వెంటనే పోస్టింగ్ ఇచ్చారు. జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలంటే సత్యనారాయణకు రిలీవింగ్ ఆర్డర్ కావాలి. ఈలోపే విషయం తెలుసుకున్న సీఎస్ నీరబ్ కుమార్ రిలీవ్ కావొద్దంటూ ఆదేశించారు.గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడ్డారనే తీవ్ర ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. అందులోనూ ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రావత్ సిక్ లీవ్‌లో ఉండటంతో ఈనెల 18న రిలీవ్ కావాల్సిన అవసరం లేదంటూ సీఎస్ స్పష్టం చేశారు. దీంతో సత్యనారాయణ తప్పించుకునే ప్రయత్నాలకు చెక్ పడినట్లయ్యింది. 2017లో రైల్వే నుంచి వచ్చి ఏపీ ఆర్థికశాఖలో సెక్రటరీగా ఐఆర్ఎస్ అధికారి సత్యనారాయణ జాయిన్ అయ్యారు. అప్పటి నుంచి ఆశాఖలో ఆయన కొనసాగుతున్నారు. గత ప్రభుత్వంలో కేవలం వైసీపీ నేతల అనుచరులుగా ఉన్న కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లించి మిగతా వారిని పక్కన పెట్టారనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో బిల్లుల కోసం హైకోర్ట్‌లో వేల సంఖ్యలో కేసులు, కోర్టు ధిక్కార కేసులు నమోదయ్యాయి. భవిష్యత్ ఆదాయాన్ని సైతం తాకట్టుపెట్టి అప్పు తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఫోన్ వస్తే చాలు ఎవరికి బిల్లులు చెల్లించమంటే వారికి చెల్లించారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఎన్డీయే ప్రభుత్వం రాగానే ఆయన ఆ బాధ్యతల నుంచి తప్పుకునేందుకు ప్రయత్నాలు చేశారు. దీంతో విషయం తెలుసుకున్న సీఎస్ ఆయనకు చెక్ పెట్టారు.

స్పీకర్ పదవిపై ఉత్కంఠ

న్యూఢిల్లీ: ఈ నెల 24 నుంచి 18వ లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారోత్సవం చేయనున్నారు. ఆ తర్వాత స్పీకర్ ఎన్నిక జరగనుంది. ఈ క్రమంలో ఆ స్థానంలో కూర్చునే వ్యక్తి ఎవరా అనే చర్చ నడుస్తోంది. ఎన్డీఏ కూటమికి నేతృత్వం వహిస్తోన్న బీజేపీ... స్పీకర్ పదవి తనవద్ద అట్టిపెట్టుకోవాలని ఆశిస్తోంది. ఇందుకోసం ప్రయత్నాలు చేస్తోంది. మూడోసారి మోదీ ప్రభుత్వ ఏర్పాటులో టీడీపీ, జేడీయూ కీలకంగా మారాయి. దాంతో రెండు పార్టీలు ఆ పదవి ఆశించినట్లు వార్తలు వచ్చాయి. అయితే కమలం పార్టీ మిత్రులకు డిప్యూటీ పోస్టు ఇవ్వాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ స్పీకర్ పదవి తమ కూటమికి ఇవ్వకపోతే స్పీకర్ పోస్టుకు అభ్యర్థిని దింపాలని విపక్ష 'ఇండియా' యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. సంఖ్యాబలం ప్రకారం బీజేపీకి చెందిన వ్యక్తే స్పీకర్‌గా ఉంటారని జేడీయూ నేత కేసీ త్యాగి వెల్లడించారు. 'దీనిపై ఎన్డీయే భాగస్వాములు మొదట చర్చలు జరుపుతాయి. ఒకసారి

- మిగతా 2 లో

ప్రయోగానికి 2,100 అణ్వాయుధాలు సిద్ధం

సిప్రి నివేదిక వెల్లడి

స్టాక్‌హోమ్: ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు తమ రక్షణ కోసం పూర్తిగా అణ్వస్త్రాలనే నమ్ముకున్నాయని ప్రముఖ అంతర్జాతీయ మేధోసంస్థ 'స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి)' వెల్లడించింది. ఏటా ఈ ధోరణి మరింత పెరుగుతోందని పేర్కొంది. అభివృద్ధి దశలో ఉన్న అణ్వాయుధాల సంఖ్య సైతం పెరిగిందని తెలిపింది. ఈమేరకు వార్షిక 'సిప్రి ఇయర్ బుక్ 2024'ను సోమవారం విడుదల చేసింది. అణ్వస్త్ర సామర్థ్యమున్న తొమ్మిది దేశాలు తమ ఆయుధాలను మరింత ఆధునికీకరిస్తున్నాయని సిప్రి వెల్లడించింది. కొన్ని దేశాలు 2023లో కొత్త ఆయుధ వ్యవస్థలను ప్రయోగానికి సిద్ధంగా ఉంచాయని పేర్కొంది. మొత్తంగా 2024 జనవరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 12,121 అణ్వస్త్రాలు ఉన్నాయని తెలిపింది. వీటిలో 9,585 ఆయుధాలు సైనిక నిల్వ కేంద్రాల్లో ఉన్నట్లు పేర్కొంది. ఇవన్నీ వినియోగానికి అందుబాటులో ఉన్నట్లేనని తెలిపింది. దాదాపు 3,904 అస్త్రాలు క్షిపణులు, యుద్ధ విమానాల్లో అమర్చి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య 60 వరకు పెరిగింది. వీటిలో దాదాపు 2,100 ఆయుధాలను ఏ క్షణమైనా ప్రయోగించేలా అత్యంత అప్రమత్తతతో ఉంచినట్లు నివేదిక స్పష్టం చేసింది. అవన్నీ రష్యా, అమెరికాకు చెందినవేనని తెలిపింది. తొలిసారి చైనా అణ్వస్త్రాలు ప్రయోగానికి సిద్ధంగా ఉంచడం గమనించామని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అణ్వస్త్రాల్లో 90 శాతం రష్యా, అమెరికాకు చెందినవేనని సిప్రి నివేదిక వెల్లడించింది. 2023లో ఈ సంఖ్యలో పెద్దగా మార్పు లేదని స్పష్టం చేసింది. అయితే, రష్యా మాత్రం ప్రయోగానికి సిద్ధంగా ఉంచిన అణ్వాయుధాల సంఖ్యను పెంచుకున్నట్లు వెల్లడించింది. ప్రపంచంలో చైనా అత్యంత వేగంగా తమ అణ్వస్త్రాల సంఖ్య పెంచుకుంటోందని సిప్రి కీలక అధికారి హాన్స్ క్రిస్టెన్‌సెన్ తెలిపారు. ఆ దేశం వద్ద 2023లో 410 ఆయుధాలు ఉండగా... ఇప్పుడు ఆ సంఖ్య 500 వరకు చేరినట్లు పేర్కొన్నారు. ఈ దశాబ్దం చివరకు చైనా తమ ఖండాంతర క్షిపణుల సంఖ్యను అమెరికా లేదా రష్యాకు సమానంగా పెంచుకుంటుందని అంచనా వేశారు. గత ఏడాదిలో భారత్ చాలా స్వల్ప స్థాయిలో అణ్వాయుధాలు పెంచుకున్నట్లు సిప్రి తెలిపింది. భారత్, పాకిస్థాన్ దేశాలు కొత్త అణ్వస్త్ర ప్రయోగ వ్యవస్థల అభివృద్ధిని కొనసాగించాయని పేర్కొంది. పాక్ ప్రధానంగా భారత్‌ను నిలువరించేందుకు వీలుగా అణ్వస్త్ర విధానాన్ని కొనసాగిస్తోందని తెలిపింది. భారత్ మాత్రం చైనాలో ఏ మూలకైనా ప్రయోగించగల ఆయుధాలపై దృష్టి సారించిందని పేర్కొంది. హమాస్‌తో యుద్ధం కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ తమ అణ్వస్త్ర సామర్థ్యాన్ని ఆధునికీకరిస్తోందని నివేదిక వెల్లడించింది. డిమోనాలో ఉన్న ప్లుటోనియం ఆధారిత రియాక్టర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపింది.

వార్ కేబినెట్ రద్దు

నెతన్యాహు కీలక నిర్ణయం

జెరూసలేం: హమాస్‌ను అంతం చేయడమే లక్ష్యంగా గాజాలో ఇజ్రాయిల్ సేనలు భీకర దాడులకు పాల్పడుతున్నాయి. యుద్ధక్షేత్రంలో తమ బలగాలకు సరైన ఆదేశాలు జారీ చేయడంలో ఇజ్రాయిల్ వార్ కేబినెట్‌ది కీలక పాత్ర. అయితే... దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తాజాగా ఈ కేబినెట్‌ను రద్దు చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ప్రతిపక్ష నేతలు బెన్నీ గాంట్జ్, గాడీ ఐసెన్‌కోట్ ఇటీవల దీన్నుంచి బయటకు వచ్చేసిన వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. గత ఏడాది అక్టోబరు 6న ఇజ్రాయిల్‌పై హమాస్ మెరుపుదాడులకు పాల్పడింది. దీంతో టెల్‌అవీవ్ సైతం ప్రతిదాడులు మొదలుపెట్టింది. యుద్ధ సమయంలో రాజకీయ విభేదాలు పక్కనపెట్టి ఐక్యత ప్రదర్శించేందుకు గాను బెన్నీ గాంట్జ్ నేతృత్వంలోని ప్రతిపక్ష నేషనల్ యూనిటీ కూటమి ప్రభుత్వంతో చేతులు కలిపింది. ఈ క్రమంలోనే అదే నెల 11న నెతన్యాహు, గాంట్జ్‌సహా అరుగురు సభ్యులతో 'వార్ కేబినెట్' ఏర్పడింది. గాజాలో యుద్ధంపై ఇది కీలక నిర్ణయాలు తీసుకుంది. అయితే... నెతన్యాహు యుద్ధాన్ని నడిపిస్తోన్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన గాంట్జ్... ఇటీవల ప్రభుత్వం నుంచి వైదొలిగారు. యుద్ధానంతర ప్రణాళికలపై స్పష్టత లేకపోవడం వల్లే రాజీనామా చేసినట్లు చెప్పారు.

అణు విద్యుత్‌లో చైనా మెరుపు వేగం



వాషింగ్టన్: అణువిద్యుత్ అభివృద్ధిలో చైనా మెరుపు వేగంతో దూసుకుపోతోందని అమెరికాకు చెందిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సంస్థ సోమవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. చైనా వేగానికి అమెరికా కనీసం 15 ఏళ్లు వెనుకబడిపోయిందని వెల్లడించింది. ప్రస్తుతం చైనా వద్ద 27 అణు విద్యుత్తు రియాక్టర్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నట్లు పేర్కొంది. ఒక్కో దానిని పూర్తి చేయడానికి బీజింగ్‌కు సగటున ఏడేళ్ల సమయం పడుతోందని తెలిపింది. ఫలితంగా చైనా ఆర్థిక వ్యవస్థ, ఈ రంగంలో సృజనాత్మక శక్తి పెరుగుదలకు ఇవి చాలా ఉపయోగపడతాయి. చైనాలోని ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థలు కూడా అణువిద్యుత్తు రంగానికి కేవలం 1.4 శాతం వడ్డీకే రుణాలు ఇస్తున్నాయి. పశ్చిమదేశాలు ఇచ్చే అప్పులతో పోలిస్తే ఇవి చాలా తక్కువ. దీనికితోడు వివిధ ప్రభుత్వ సంస్థలు వీటికి అండగా నిలుస్తున్నాయి. దీంతో స్థానికంగా అణువిద్యుత్తు రంగంలో ఇప్పుడు చైనా ప్రబల శక్తిగా ఎదిగింది. ఇప్పటికే బీజింగ్ పునరుత్పాదక ఇంధనం, విద్యుత్తు కార్ల విషయంలో అగ్రగామిగా నిలిచింది. అణు విద్యుత్తులోనూ వేగంగా దూసుకెళుతోంది. షిడో బేలో నిర్మించిన నాలుగోతరానికి చెందిన హైటెంపరేచర్ గ్యాస్ కూల్డ్ రియాక్టర్ గతేడాది ఆన్‌లైన్‌లోకి వచ్చింది. దీనిపై ది చైనా న్యూక్లియర్ ఎనర్జీ అసోసియేషన్ స్పందిస్తూ... వీటిల్లో వినియోగించే 2,200 పరికరాలను పూర్తిగా దేశీయంగానే అభివృద్ధి చేసినట్లు పేర్కొంది. ప్రస్తుతం అమెరికా వద్దే అత్యధికంగా అణు రియాక్టర్లు ఉన్నాయి. కానీ, జో బైడెన్ సర్కారు పర్యావరణ మార్పులను ఎదుర్కొనేందుకు వీలుగా ఉద్గారాలు, శుద్ధ ఇంధనంపై దృష్టిపెట్టింది. అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో 2023-24 సంవత్సరాల్లో రెండు భారీ న్యూక్లియర్ ప్లాంట్లు ఆన్‌లైన్ అయ్యాయి. కానీ, వీటి నిర్మాణ సమయం, ఖర్చు అనుకున్న దానికంటే ఎక్కువగా ఉన్నాయి. దీంతోపాటు అమెరికా ఇంకా కొత్తగా అత్యాధునిక అణు రియాక్టర్ల నిర్మాణాలు చేపట్టలేదు. ఓ యూనివర్సిటీలో నిర్మించాలనుకొన్న ల్యాబ్ ప్రాజెక్టును మూసేసింది. అమెరికా ఈ రంగంపై పూర్తిస్థాయిలో దృష్టిపెడితే మాత్రం వేగంగానే చైనా కంటే ఎక్కువ అభివృద్ధి సాధించగలదని ఈ నివేదిక రాసిన స్టీఫెన్ ఎజెల్ వెల్లడించారు.

రెండు రైళ్లు ఢీ

(మొదటిపేజీ తరువాయి)

మరణించగా, 41 మందికి గాయాలయ్యాయి. సమాచారమందుకున్న రైల్వే పోలీసులు, సహాయ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రైల్వే అధికారుల సమాచారం ప్రకారం... అసోంలోని సిల్చార్ నుంచి కోల్‌కతాలోని సెల్దాకు బయల్దేరిన కాంచనగంగ ఎక్స్‌ప్రెస్ మధ్యలో న్యూజల్పాయ్‌గురి వద్ద ఆగింది. అక్కడి నుంచి బయల్దేరిన కాసేపటికే రంగపాని స్టేషన్ సమీపంలో ఎక్స్‌ప్రెస్‌ను వెనుక నుంచి ఓ గూడ్స్ రైలు బలంగా ఢీకొట్టింది. దీంతో గూడ్స్ రైలు బోగీలు చెల్లాచెదురుగా పడిపోగా, ఎక్స్‌ప్రెస్ రైలు రెండు బోగీలు పట్టాలు తప్పాయి. ఓ బోగీ ఏకంగా గాల్లోకి లేచింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మరణించారని, 41 మంది గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. ప్రమాద సమాచారం తెలియగానే రైల్వే, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. సిగ్నల్ జంప్ కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. రెడ్ సిగ్నల్ వేసినా గూడ్స్ రైలు పట్టించుకోకుండా వెళ్లినట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రమాదం ఏడాది క్రితం ఒడిశాలోని బహనాగ బజార్ సమీపంలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద ఘటనను గుర్తుకు తెచ్చింది. ఈ ప్రమాదంలో దాదాపు 300 మంది మరణించగా... వెయ్యిమందికి పైగా గాయాలపాలయ్యారు. 13174 నంబరు కాంచనగంగ ఎక్స్‌ప్రెస్ అగర్తల నుండి సీల్దాకు బయల్దేరగా... ఉదయం 9 గంటలకు ప్రమాదం జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ దిల్లీ నుంచి బాగ్డోగ్రా విమానాశ్రయానికి...అక్కడి నుంచి బైక్‌పై ఘటనా స్థలికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించిన వెంటనే నేరుగా క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. రైలు ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుపుతామని మీడియా మాట్లాడుతూ అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. 'సహాయచర్యలు పూర్వయ్యాయి. పునరుద్ధరణ పనులపై దృష్టి సారించాం' అని మంత్రి తెలిపారు. ప్రమాద ఘటనకు సంబంధించి విపక్షాల విమర్శలపై ప్రశ్నించగా... ఇది రాజకీయాలకు సమయం కాదని వారించారు. కాగా, రైలు ప్రమాదంలో మరణించిన వారిలో గూడ్స్ రైలు లోకోపైలట్, ఎక్స్‌ప్రెస్ రైలు గార్డ్ సహా ముగ్గురు రైల్వే ఉద్యోగులు కూడా ఉన్నారని అధికారులు ధ్రువీకరించారు.

వివిధ రైళ్లు రద్దు...దారి మళ్లింపు

ప్రమాద నేపథ్యంలో ఆ మార్గంలో వివిధ రైల్వే సర్వీసులను రద్దు చేసినట్లు రైల్వే శాఖ ప్రకటించింది. అలాగే వివిధ రైళ్లను దారి మళ్లించినట్లు వెల్లడించింది. 19 రైళ్లు రద్దు చేశామని... మరో 9 రైళ్లు దారి మళ్లించినట్లు వివరించింది. అందులో దిబ్రుఘడ్-న్యూదిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్, హౌరా-న్యూజల్పాయిగురి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఉన్నాయని తెలిపింది. రద్దు చేసిన రైల్వే సర్వీసులను ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించింది.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

ఘోర రైలు ప్రమాదంలో మృతిచెందిన వారికి రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల కుటుంబసభ్యులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. తీవ్రంగా గాయపడినవారికి రూ.2.5 లక్షలు, స్వల్పగాయాలైన వారికి రూ.50 వేల చొప్పున అందజేస్తామని తెలిపారు. ఈ ఘటన చాలా దురదృష్టకరమని, సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నట్లు వైష్ణవ్ తొలుత పేర్కొన్నారు. రైల్వే, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పరస్పర సహకారంతో పని చేస్తున్నాయని తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించినట్లు తెలిపారు. ఘటనా స్థలికి సీనియర్ ఉన్నతాధికారులు చేరుకున్నారని పేర్కొన్నారు.

రాష్ట్రపతి, ప్రధాని, రాహుల్ సహా ప్రముఖుల దిగ్భ్రాంతి

న్యూదిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో జరిగిన కాంచన్ జంఘా రైలు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, అనేక రాష్ట్రాల ముఖ్యమంత్రులు సహా అనేకమంది ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డార్జిలింగ్ రైలు ప్రమాద వార్త చాలా బాధ కలిగించిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అధికారులతో మాట్లాడి పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఘటనా స్థలానికి వెళ్లినట్లు తెలిపారు.

యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు: మమత

రైలు ప్రమాద ఘటనపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డార్జిలింగ్ జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాద ఘటన గురించి తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు మమతా బెనర్జీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. డీఎం, ఎస్పీ, డాక్టర్లు, అంబులెన్స్‌లు, డిజాస్టర్ టీమ్‌లు సహాయక చర్యల కోసం ఘటనా స్థలికి చేరుకున్నాయని, యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని అన్నారు.

ఎక్కువ మంది అసోం వారే...

ప్రమాదానికి గురైన రైలులో ఎక్కువ మంది అసోం వారే ఉన్నట్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వా శర్మ తెలిపారు. ప్రమాద ఘటనలపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మాట్లాడాడని చెప్పారు. త్రిపు నుంచి అసోం మీదుగా రైలు ప్రయాణిస్తోందని, అసోం ప్రయాణికులే ఎక్కువ మంది ఉండటంతో ఆందోళన చెందుతున్నామని చెప్పారు. అవసరమైన అన్నిరకాల సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

మోదీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణం: రాహుల్

కాంచన్ జంఘా రైలు ప్రమాదంలో చాలా మంది మరణించారనే వార్త తనను కలచి వేసిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని చెప్పారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. రైలు ప్రమాద ఘటన స్థలంలో సహాయక చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు రాహుల్ పిలుపు నిచ్చారు. గత పదేళ్లలో రైల్వే ప్రమాదాలు పెరగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు మోదీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని విమర్శించారు. ప్రతి రోజు ప్రయాణికులు ప్రాణాలతోపాటు ఆస్తి నష్టం కూడా జరుగుతోందన్నారు. అందుకు ఈ ప్రమాదం.. ఈ వాస్తవికతకు మరో ఉదాహరణ అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. బాధ్యతాయుత ప్రతిపక్షంగా తాము ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. అలాగే ఈ ప్రమాదాలకు మోదీ ప్రభుత్వాన్ని బాధ్యులుగా చేస్తామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ప్రకటించారు.



పోలవరం విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

నాటికి ప్రాజెక్టు పూర్తయ్యేది. కానీ ఇప్పుడు ఈ రిపేరు పనులకే నాలుగు సీజన్లు పడుతుందని అధికారులు చెప్తున్నారు. అది కూడా అనుకున్న ప్రకారం అన్నీ సవ్యంగా జరిగితేనే' అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాజెక్టుకు జగన్ చిక్కుముళ్లు వేశారు

'ఒక వ్యక్తి రాష్ట్రానికి శాపంగా మారతాడని చెప్పడానికి పోలవరం ఒక కేస్ స్టడీ. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ దీనిపై చర్చించాలి. జరిగిన నష్టం ప్రతి ఒక్కరికీ తెలియాలి. ఏ ఒక్కటీ దాచిపెట్టకూడదు. కాఫర్ డ్యాం ద్వారా నీళ్ల లీకేజీ కంట్రోల్ అవ్వకపోతే డయాఫ్రం వాల్ పనులు చేయడం కుదరదు. లీకేజీ ద్వారా వచ్చిన నీళ్లు ఎత్తిపోయాలంటే భారీగా ఖర్చు అవుతుంది. జగన్ చేతకాని తనంతో ప్రాజెక్టుకు చిక్కు ముళ్లు వేశారు. 2014-19 వరకు సగటున ఏటా రూ.13,683 కోట్లను మా ప్రభుత్వం ఇరిగేషన్ మీద ఖర్చు చేసింది. బడ్జెట్ పెరిగిప్పుడు కేటాయింపులు పెరగాలి. కానీ వైసీపీ ప్రభుత్వంలో అలా జరగలేదు. ఆంధ్రుల జీవనాడి పోలవరాన్ని పూర్తి చేయాలి. ఇది ప్రతి ఒక్కరికీ సంబంధించిన ప్రాజెక్టు. ప్రాజెక్టు పరిస్థితి చూస్తే బాధ, ఆవేదన కలుగుతోంది. అయినా నిబ్బరంగా ఉండి ముందుకు తీసుకెళ్తాం. 2019లో ఏజెన్సీని మార్చొద్దని పీపీఏ, కేంద్రం కూడా లేఖ రాసినా జగన్ వినిపించుకోలేదు. పోలవరాన్ని వివాదాలకు కేంద్రంగా మార్చారు. ప్రాజెక్టును ఎలాగైనా పూర్తి చేయాలి. నష్టం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. దీనిపై కేంద్రంతో సంప్రదింపులు జరిపి ముందుకెళ్తాం' అని చంద్రబాబు అన్నారు. ఈ పర్యటనలో రాష్ట్ర మంత్రులు డా. నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, కందుల దుర్గేశ్, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, శాసనసభ్యులు చిర్రి బాలరాజు, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, ఆరిమిల్లి రాధాకృష్ణ, సొంగా రోషన్ కుమార్, పితాని సత్యనారాయణ, జ్యోతుల నెహ్రూ, వసంత కృష్ణ ప్రసాద్, నిమ్మకాయల చిన రాజప్ప, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇరిగేషన్ శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ వై. ప్రసన్న వెంకటేశ్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ప్రాజెక్టు నిర్వాసితులు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, ఆర్ ఆర్ ప్యాకేజీ తక్షణం అమలు చేయాలని కోరారు. ఖాళీ చేయించే రోజునే కటాఫ్ తేదీగా నిర్ణయించి 18 ఏళ్లు నిండిన వారికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. పోడు భూములకు 2006 అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం హక్కుపత్రాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మండలాన్ని యూనిట్‌గా గుర్తించి పునరావాసం కల్పించాలని కోరారు.

130 నగరాలకు అమెజాన్ ఫ్రెష్ విస్తరణ

ఇంటి ముంగిటకు కిరాణా సౌకర్యం

విశాలాంధ్ర-కడప: ఫుల్ బాస్కెట్ కిరాణా సరుకుల సర్వీస్ అమెజాన్ ఫ్రెష్ 130 నగరాలకు విస్తరించినట్లు సంస్థ ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమెజాన్ ఇండియా, అమెజాన్ ఫ్రెష్ సెల్లర్స్... 11 వేలకు పైగా పండ్లు, కూరగాయల రకాలను రైతుల నుంచి సేకరిస్తారన్నారు. '4-స్టెప్ నాణ్యతా తనిఖీ' ద్వారా ఉత్పత్తి నాణ్యతను నిర్ధారిస్తారన్నారు. అంబాలా, ఔరంగాబాద్, హోషియార్ పూర్, ధార్వాడ్, ఉనా, సూరి వంటి 130 నగరాల్లో వినియోగదారులకు ఇంటి ముంగిటకే తీసుకురావడంతో సమయం ఆదా కావడంతో వారు ఆనందిస్తారన్నారు. తమ వారపు/నెలవారీ బాస్కెట్‌ను రూపొందిస్తున్నప్పుడు అమెజాన్ ఫ్రెష్ సెల్లర్స్, బ్యాంక్ భాగస్వాముల నుంచి ఉత్తేజభరితం పొందుతారన్నారు. భారతదేశంలో కిరాణా షాపింగ్ అమెజాన్ ఫ్రెష్ పునఃరూపుదిద్దుతోందని డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీరామ్ చెప్పారు. క్యాష్ బాక్ ఆఫర్స్, బ్యాంక్ డిస్కౌంట్స్ నుంచి కస్టమర్స్ ప్రయోజనాలు పొందవచ్చన్నారు. అమెజాన్ ఫ్రెష్ కిరాణా సరుకుల కోసం amazon.in పై ప్రత్యేకమైన యాప్-ఇన్-యాప్ తో సులభమైన షాపింగ్ అనుభవాన్ని, తరచుగా షాపింగ్ చేసిన వస్తువులు చెక్ అవుట్ సమయంలో మర్చిపోకుండా వ్యక్తిగత విడ్ గెట్స్, బై గైన్ ఆప్షన్, రిమైండర్స్ వంటి సౌకర్యవంతమైన ఫీచర్స్ అందిస్తుందన్నారు. ప్రతి నెల ఒకటి నుంచి ఏడు వరకు సూపర్ వేల్యూ డేస్ తో కస్టమర్స్ తమ నెలవారీ బాస్కెట్ ను రూపొందించుకోవచ్చన్నారు.

రెడ్‌సిగ్నల్ వేసినా....పట్టించుకోలేదు

రైల్వే అధికారులు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో కాంచన్‌జంఘా ఎక్స్‌ప్రెస్‌ను ఓ గూడ్స్ రైలు ఢీకొట్టిన ప్రమాదంపై రైల్వే అధికారులు స్పందించారు. సిగ్నల్ జంప్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిన్నట్లు రైల్వే బోర్డ్ అధికారులు తెలిపారు. రెడ్ సిగ్నల్ వేసినా గూడ్స్ రైలు లోకోపైలెట్ పట్టించుకోకుండా వెళ్లడం వల్లే ఈ ఘటన జరిగిందని రైల్వే బోర్డ్ సీఈఓ జయ వర్మ సిన్హా పేర్కొన్నారు. 'ఈ ప్రమాదం సోమవారం ఉదయం 8:55 గంటలకు జరిగింది. కాంచన్‌జంఘా ఎక్స్‌ప్రెస్‌ను వెనుక నుంచి ఓ గూడ్స్ రైలు వచ్చి ఢీ కొట్టింది. రెడ్ సిగ్నల్ వేసినా గూడ్స్ ట్రైన్ లోకోపైలెట్ పట్టించుకోకుండా ముందుకు వెళ్లిన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనలో గూడ్స్ రైలు లోకోపైలెట్, అసిస్టెంట్ లోకోపైలట్, కాంచన్‌జంఘా ఎక్స్ ప్రెస్ గార్డు మృతి చెందారు. అసోం- సీల్దా మార్గంలోని అన్ని రైల్వే స్టేషన్లలో హెల్ప్ డెస్క్?లు ఏర్పాటు చేశాం' అని జయ వర్మ సిన్హా వెల్లడించారు. మరోవైపు కాంచన్‌జంఘా ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 10 బస్సులు ఏర్పాటు చేసినట్లు బెంగాల్ ఆర్టీసీ చైర్మన్ తెలిపారు. ఈ బస్సులు ఘటన స్థలానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. సిలిగుడి - కోల్‌కతా వెళ్లడానికి మధ్యాహ్నం నుంచి అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

జగన్ భద్రత కుదింపు

(మొదటిపేజీ తరువాయి)

చుట్టూ భద్రతా సిబ్బందితో పహరా ఉండేది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అక్కడున్న రెడ్ జోన్‌ను తొలగించారు. జగన్ ఇంటి ముందున్న రోడ్డును సాధారణ ప్రజలు వినియోగానికి అవకాశం కల్పించారు. దీంతో అక్కడ సామాన్యుల తాకిడి పెరిగింది. జగన్‌కు భద్రత తొలగించారన్న వార్తలతో వైసీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా జగన్ 30 మందితో తన వ్యక్తిగత భద్రతా సిబ్బందిని నియమించుకున్నారు. ఏకరూప దుస్తుల్లో ఉన్న వారంతా సోమవారం మధ్యాహ్నం తాడేపల్లిలోని జగన్ నివాసానికి చేరుకున్నారు. అనంతరం జగన్ నివాస పరిసర ప్రాంతాల చుట్టూ భద్రత ప్రైవేట్ ఏజెన్సీల సిబ్బంది ఆధీనంలోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం జగన్‌కు ప్రభుత్వం తరపున భద్రతా సిబ్బందితోపాటు ప్రైవేటీ ఏజెన్సీ తరపున వచ్చిన వారు ఉంటారు. గతంలో ఓదార్పు యాత్ర సమయంలో జగన్ ఇదే తరహాగా భారీగా వ్యక్తిగత భద్రతా సిబ్బందిని నియమించుకున్నారు. 2019 మందు వరకు వారంతా కొనసాగారు. అనంతరం జగన్ అధికారంలోకి రావడంతో ప్రభుత్వ పరంగాను, సీఎం హోదాలో భద్రతను కల్పించారు. ఈ ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలవ్వడం, కనీసం ప్రతిపక్ష హోదాను సైతం దక్కించుకోకపోవడంతో జగన్ భద్రతను కుదించేశారు.

రాత మార్చిన రాజీనామా!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒక్కసారిగా వలంటీర్ల గౌరవ వేతనం రూ.ఐదువేల నుంచి రూ.10 వేలకు పెరగనుంది. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించడం, పరిపాలపై వేగవంతం చేసే పనిలో నిమగ్నమవ్వడంతో... మేనిఫెస్టోలో తమకు ఇచ్చిన హామీపై వలంటీర్లు ఆశతో ఉన్నారు. దీంతో రూ.10వేల వేతనం కోసం వారంతా ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానికంగా ఉన్న 18 నుంచి 35 ఏళ్ల యువతను వలంటీర్లుగా నియమించారు. వారి విద్యార్హతను ఇంటర్మీడియట్‌గాను, గిరిజన ప్రాంత వాసులకైతే పదో తరగతిగాను నిర్ధారించి ఎంపిక చేశారు. వారంతా అదే గ్రామ, వార్డుకు చెందిన వారై ఉండాలన్న నిబంధన విధించారు. 50 కుటుంబాలకు ఒక వలంటీరు చొప్పున బాధ్యత కేటాయించారు. ఈ తరహాగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం రెండు లక్షల 30వేల మంది వలంటీర్లను నియమించారు. వారికి రూ.ఐదువేల గౌరవ వేతనం అమలు చేశారు. ప్రభుత్వం అందించే సేవలు, పథకాలపై ఖచ్చితమైన సమాచారం అందించడమే వలంటీర్ల ప్రధాన లక్ష్యంగా గత ప్రభుత్వం నిర్ధారించింది.

ఇప్పుడు కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాజీనామా వలంటీర్లు రోడ్డెక్కుతున్నారు. రాష్ట్ర మంత్రులకు ప్రకటించిన శాఖల్లోను ప్రత్యేకంగా గ్రామ, వార్డు సచివాలయం, వలంటీర్లకు ఒక శాఖను కేటాయించారు. గత ప్రభుత్వం తరహాగానే వలంటీర్లకు ప్రత్యేక మంత్రిత్వశాఖ కేటాయించడంతో వారిలో ఆశలో పెరిగాయి. ఈశాఖ మంత్రిగా ప్రకాశంజిల్లా కొండెపి నియోజకవర్గానికి చెందిన డోలా బాల వీరాంజనేయులకు బాధ్యతలు అప్పగించారు. మంత్రిగా నియమితులైన నిమ్మల రామానాయుడు వలంటీర్ల వ్యవస్థను తొలగించబోమని వెల్లడించారు. ఇప్పటికే మంత్రి డోలాను గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు కలిసి తమ సమస్యల్ని విన్నవించారు. పదోన్నతుల దగ్గర నుంచి విధుల నిర్వహణలో ప్రక్షాళన చేపట్టాలని, ఏక రూప దుస్తుల నిబంధన తొలగించాలని కోరగా...ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో రాజీనామాలు చేసిన వలంటీర్లు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. ఇలా రాజీనామాలు చేసిన వలంటీర్ల సంఖ్య తొలుత వందల్లో ఉండగా... అది ఎన్నికల సమయానికి వేలకు చేరింది. నెల్లూరు జిల్లాలోని నెల్లూరు పట్టణం, కొవ్వూరు నియోజకవర్గాల్లో వందలాదిగా వలంటీర్లు రాజీనామాలు చేసి టీడీపీలోకి వెళ్లిన సందర్భాలున్నాయి. ఎంత మంది రాజీనామాలు చేశారనేదీ, వారిలో ఎందరివి ఆమోదించారనేదే అధికారికంగా ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది. కృష్ణా, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, శ్రీకాకుళం, చిత్తూరు తదితర జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాల్లో వలంటీర్లు రాజీనామాలు చేశారు. మిగిలిన వాంతార మౌనంగా ఉండిపోయారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లకు జూన్ నెల గౌరవ వేతనం రూ.ఐదు వేలు వారి బ్యాంకు ఖాతాల్లో పడింది. రాజీనామాలు చేసిన వారికి మాత్రం గౌరవ వేతనం అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎక్కడికక్కడే స్థానిక సంస్థలకు చెందిన నేతలను కలుస్తూ వినతులను అందజేస్తున్నారు.

మోసబోయామంటూ నెల్లూరులో ఫిర్యాదు

వైసీపీ నేతల మాటలు నమ్మి తాము మోసబోయామని వాపోతూ నెల్లూరు చిన్నపట్టణం పోలీస్‌స్టేషన్‌లో పలువురు వలంటీర్లు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఇదే తరహాగా రాజీనామాలు చేసిన వలంటీర్లు టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలను కలుస్తున్నారు. మరోవైపు వైసీపీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను కలుస్తూ తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. మీ మాటలు నమ్మి బలవంతంగా రాజీనామాలు చేశామని వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము జీవనాధారం కోల్పోయామని వాపోతున్నారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు రాజీనామాలు చేసిన వలంటీర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. చాలా మంది వైసీపీ స్థానిక నేతలకు ఫోన్లు చేసి తమను విధుల్లోకి తీసుకునేలా చూడాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. వారి ఫోన్లకు వైసీపీ నేతలు స్పందించకుండా మౌనం దాలుస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో ఇళ్లకు సైతం వెళ్లి వారిని నిలదీయడంతో ఏం చెప్పాలో తెలియక వైసీపీ నేతలు వారిని పంపేస్తున్నారు. ప్రభుత్వం మార్పుతో తామేమీ చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు.

కిలో రూ.100

(మొదటిపేజీ తరువాయి)

కొరతతో జులైలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కిలో రూ.60కిపైనే పలుకుతోంది. గత రెండు, మూడు వారాలలో గతేడాది కంటే ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయని వ్యవసాయ మార్కెట్ డేటా చూపిస్తోంది. బెంగళూరులోని రిటైల్ మార్కెట్‌లో కిలో టమాట రూ.80 పలుకుతోంది. 'ఈ ఏడాది చాలా రోజులపాటు 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇది ఫలదీకరణ దశలో పంటను దెబ్బతీసింది. ఫలితంగా ఉత్పత్తి తగ్గింది. సరఫరా ఎక్కువగా లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి' అని మహారాష్ట్ర నాసిక్ జిల్లాలోని పింపాల్‌గావ్ ఏపీఎంసీ (వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ) అధికారి సచిన్ పాటిల్ చెప్పారు. ఇక హైదరాబాద్‌లో సైతం ఇలాంటి పరిస్థితే ఉంది. ఇక్కడ నాణ్యమైన మొదటి రకం టమాటా కిలో రూ.80 నుంచి రూ.90 పలుకుతోంది. రెండోరకం టమాటా కిలో ధర రూ.60 నుంచి రూ.70 ఉంది. హోల్ సేల్ మార్కెట్లలో రూ. 120కి మూడు కిలోల టమాట విక్రయిస్తున్నారు. ఉత్తర భారతదేశంలో ధరలు ఇంకా అదుపులోనే ఉన్నాయి. జులై నుంచి అక్టోబర్ వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. కిలో టమాట రూ.100 కూడా దాటే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. దీంతో టమాటలను సబ్సిడీపై అందించాలని ప్రజలు ప్రభుత్వాలను కోరుతున్నారు.

స్పీకర్ పదవిపై ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

అందరి ఆమోదం లభించిన తర్వాత మేం అభ్యర్థిని నిలబెడతాం. ఆ వ్యక్తికి కూటమి పార్టీలన్నీ మద్దతు తెలుపుతాయి' అని టీడీపీ పేర్కొంది. అయితే ప్రస్తుత సమాచారం ప్రకారం స్పీకర్ పదవి బీజేపీ వద్దే ఉంటే... రాజస్థాన్ కోటా స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఓం బిర్లాకు మరోసారి అవకాశం ఇవ్వొచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ బీజేపీ శాఖ అధ్యక్షురాలు పురందేశ్వరి పేరు కూడా ప్రచారంలో ఉంది. వీరు కాకుండా మరెవరైనా తెరపైకి రావొచ్చని తెలుస్తోంది. పనిలో పనిగా స్పీకర్ పదవి తీసుకోవాలని ఇండియా ఐక్యసంఘటన పార్టీలు మాత్రం టీడీపీకి సూచిస్తున్నాయి.

గ్రామసభల్లోనే గుర్తింపు కార్డులు

- 27న తహసీల్దార్‌లకు అర్జీలు
- వ్యక్తిగత హామీతో సబ్సిడీపై ఎరువులు, పురుగుమందులు
- ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కౌలు రైతులందరికీ సులభంగా గుర్తింపు కార్డులు జారీచేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 27న తహసీల్దార్లకు అర్జీలు సమర్పించాని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర సమావేశం తీర్మానించింది. విజయవాడ దాసరిభవన్‌లో సోమవారం సంఘం నాయకులు కె.తిమ్మయ్య అధ్యక్షతన సంఘ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. కౌలురైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను చర్చించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య వివిధ తీర్మానాలను సమావేశంలో ప్రవేశపెట్టగా, వాటిని ఏకగ్రీవంగా సమావేశం ఆమోదించింది. గత ప్రభుత్వం 2019లో తీసుకువచ్చిన పంట సాగుదారుల హక్కు చట్టాన్ని సవరించాలని, గ్రామ సభల్లోనే కౌలురైతులను గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, నూతనంగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వాన్ని కోరుతూ పెట్టిన తీర్మానాన్ని రాష్ట్రసమావేశం ఏకగ్రీవంగా అమోదించింది. ఎన్నికల హడావుడిలో ప్రభుత్వం కౌలురైతులకు ఖరీఫ్ సమయంలో ఇవ్వాల్సిన గుర్తింపుకార్డుల జారీలో ఆలస్యమైందని, కౌలురైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకొచ్చి పచ్చిరొట్టవిత్తనాలు, అన్నిరకాల పంటలవిత్తనాలు, సూక్ష్మపోషకాలు, ఎరువులు, పురుగు మందులు 90శాతం సబ్సిడీపై అందించాలని ప్రభుత్వాన్ని కోరింది. దేవదాయ, ధర్మదాయశాఖ సాగుభూముల వేలం నిలుపుదల చేయాలని, గతేడాది సాగు చేసిన వారికి నామినల్ లీజుకు తిరిగి ఇవ్వాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. గతేడాది వర్షాభావ పరిస్థితులు వల్ల కొన్ని పంటలు వేయలేదని, వేసినా నీరు లేక పంటలు ఎండిపోయి కౌలురైతులు నష్ట పోయారని వివరించింది. మిచౌంగ్ తుపాన్ వల్ల చేతికి వచ్చిన పంటలు దెబ్బతిని అప్పులు పాలయ్యారని, ఈ నేపథ్యంలో వేలం పాటలు రద్దు చేసి గతేడాది సాగుచేసిన వారికే కౌలురేట్లు తగ్గించి సాగు భూములను లీజుకు ఇవ్వాలని కోరింది. కౌలురైతులకు పంటరుణాలు అందజేయడానికి ప్రత్యేక రుణప్రణాళికను ఏర్పాటు చేయాలని, కౌలురైతులు సాగు చేస్తున్న భూమి దామాషాను బట్టి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి సున్నా వడ్డీకే పంటరుణాలు అందించాలని విజ్ఞప్తి చేసింది.

ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి: ఈశ్వరయ్య

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ సాగుకు అవసరమైన విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు ఉచితంగా అందించాలని కోరారు. కౌలురైతుల రక్షణ,సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ పంట కాలువల్లో పేరుకుపోయిన పూడిక, తూటికాడ, గుర్రపుడెక్క తొలగించి సాగునీరు సక్రమంగా పారేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. రబీలో రావలసిన ఇన్‌పుట్ సబ్సిడీని వెంటనే అందించాలన్నారు. సంఘ గౌరవాధ్యక్షుడు సీహెచ్.కేశవ్‌శెట్టి మాట్లాడుతూ దేవదాయ ధర్మదాయ కౌలురైతుల రక్షణ కోసం ప్రభుత్వం సమగ్రమైన విధానాన్ని తీసుకురావాలని కోరారు. తరతరాల నుంచి సాగుచేసుకుంటున్న భూములకు యాజమాన్య హక్కు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కౌలురైతుల సంఘం కర్నూలుజిల్లా అధ్యక్షుడు జి.పంపన్‌గౌడ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బుడ్డి రమేశ్, మేకల డేవిడ్, ఏలూరు జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు తలారి రామారావు, టి.చిన్నకొండయ్య, గుంటూరు జిల్లా అధ్యక్షుడు కంజుల విఠల్ రెడ్డి, కె.జగన్నాథం, అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీటీ రామాంజనేయులు, నీలపాల రామకృష్ణ, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు చౌడప్ప యాదవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీలో యువరక్తం ఎక్కించాలి

పల్లాకు సీఎం చంద్రబాబు సూచన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పార్టీ బలోపేతానికి సమర్థంగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన పల్లా శ్రీనివాస్‌కు పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. యువతతోనే సమాజంలో మార్పులు సాధ్యమవుతాయని, పార్టీలో యువరక్తం ఎక్కించాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాస్ యాదవ్...సోమవారం ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... 'నమ్మకంతో అతిపెద్ద బాధ్యత నీకు అప్పగించాం. సమర్థంగా నిర్వహించాలి. అధికారంలో ఉన్నపుడు ప్రతి కార్యకర్తను దగ్గర చేర్చుకోవాలి. ప్రతి ఒక్కరికీ తగు గౌరవం కల్పించాలి. ప్రత్యేకంగా యువతను పార్టీలోకి ఆహ్వానించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల నుండి యువతను రాజకీయాల్లోకి స్వాగతించాలి. జాతీయ అధ్యక్షునిగా పార్టీ పరంగా, ముఖ్యమంత్రిగా ప్రభుత్వ పరంగా అండగా ఉంటాను. నిత్యం కార్యకర్తలతో అనుసంధానమై పార్టీకి ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలి. పార్టీ పరంగా అన్ని రకాలుగా సంపూర్ణ మద్దతు ఇస్తాను. సీనియర్ల సూచనలు, జూనియర్లు, యువత మద్దతుతో పార్టీని మరింత బలోపేతం చేయాలి. వచ్చే నెల నుండి పార్టీ మెంబర్ షిప్ డ్రైవ్ కూడా పునఃప్రారంభించాలి. వీలైనంత త్వరగా నామినేటెడ్ పదవుల్లో పని చేసిన కార్యకర్తల్ని నియమించి గౌరవించాలి. అదే సమయంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి నాయకుడికి తగిన గుర్తింపు ఇవ్వాలి' అని సూచించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ను కూడా పల్లా కలిశారు. రాష్ట్ర అధ్యక్షునిగా నియమించడంపై కృతజ్ఞతలు తెలిపారు. నాకంటే పెద్ద బాధ్యత మీపై ఉంచారని ఈసందర్భంగా నారా లోకేశ్ పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో కార్యకర్తలు, నాయకులు స్తబ్దుగా ఉన్నారని, వారందరినీ క్రియాశీలం చేయాల్సిన గురుతర బాధ్యత మీపై ఉందని అన్నారు. పార్టీ కార్యాలయంలో మెరుగైన వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నామని, తద్వారా ప్రతి మంత్రి కూడా నెలలో ఒక రోజు కనీసం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండబోతున్నారని తెలిపారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి సముచిత న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ అధినాయకత్వం నుండి సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఏం కావాలన్నా అందించేందుకు పార్టీ సిద్ధంగా ఉందని లోకేశ్ తెలిపారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడం కోసం అనునిత్యం కష్టబడతానని, సీనియర్ల సలహాలతో పార్టీకి యువరక్తం ఎక్కించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పల్లా శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోనన్నారు.

సిబ్బందికి రూ.కోటి ప్రత్యేక అవార్డు

విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాఘవేంద్రరావు

విశాలాంధ్ర-విజయవాడ: సహకార స్ఫూర్తితో ఉత్తమ సేవలు అందిస్తూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొండి బకాయిల వసూలుకు పటిష్ఠ చర్యలు చేపట్టిన విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ సిబ్బందికి కోటి రూపాయల ప్రత్యేక అవార్డును విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ప్రకటించారు. విజయవాడ, హైదరాబాద్, తిరుపతి జోన్ పరిధిలోని శాఖల సిబ్బందికి సహకార వ్యవస్థ ప్రాధాన్యతపై సోమవారం విజయవాడ ఎంబీకే భవన్‌లో ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన రాఘవేంద్రరావు మాట్లాడుతూ బ్యాంక్ అభివృద్ధిలో భాగంగా పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు అత్యధిక నిధుల సాధనకు, నిరర్థక ఆస్తుల తగ్గింపునకు కృషి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ బ్యాంక్‌లో సుమారు 700 మంది సిబ్బందికి ఒక్కొక్కరికీ రూ.14 నుంచి 30 వేలు చొప్పున నగదు అందనుందని తెలిపారు. విశాఖ బ్యాంక్‌కు జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉన్నందున భవిష్యత్తులో ఈ సంస్థ ఎదుగుదల ఉద్యోగుల జీవనప్రమాణాల పెరుగుదలపై ఆధారపడి ఉందన్నారు. సహకార జీవనం లేకుండా మానవ మనుగడ లేదని నమ్ముతున్న పాలకవర్గం నిర్ణయాలను సిబ్బంది శ్రద్ధతో అమలు చేయాలన్నారు. 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో సహకార వ్యవస్థ ఆవశ్యకతపై తెలుగు రాష్ట్రాల్లో సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణలో సిబ్బంది భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బ్యాంకు మార్గదర్శకులు మానం ఆంజనేయులు మాట్లాడుతూ రాఘవేంద్రరావు నాఫ్కాబ్ డైరెక్టర్‌గా ఎన్నికైన నేపథ్యంలో దేశంలోని 1500 సహకార బ్యాంకులు మనవైపు చూస్తున్నాయని, మనం మరింత అంకితభావంతో పనిచేసి బ్యాంక్‌కు గుర్తింపు తీసుకురావాలని కోరారు. పాలకవర్గం, సిబ్బంది, సభ్యులు మరింత సమన్వయంతో, ఐక్యతతో పనిచేస్తూ భవిష్యత్తు తరాలకు బాటలు వేయాలన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు తోడ్పాటు అందించడం ద్వారా బ్యాంకు లక్ష్యాలను ముందుకు తీసుకు వెళ్లాలని, అదే మన ఆశయం కావాలన్నారు. సదస్సులో బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.రామకృష్ణారావు, డైరెక్టర్లు జేవీ సత్యనారాయణ మూర్తి, జనార్దన్, చిన్నం కోటేశ్వర రావు, పి.రమణరావు, పి.నారాయణస్వామి, సీఈవో నర్సింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి

ఏఐటీయూసీ, ఆశావర్కర్స్ యూనియన్ నేతల డిమాండ్

విశాలాంధ్ర-కడపరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబునాయుడు ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్. వెంకటసుబ్బయ్య, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.సుభాషిణి, ఎల్.శాంతి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్వచ్ఛంద సేవకులుగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలను జిల్లా అధికారులు అక్రమంగా బదిలీలు చేస్తున్నారని అక్రమ బదిలీలు ఉపసంహరించుకోవాలని కోరారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2018లో ఇప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సుదీర్ఘకాలం ఆశాలు చేసిన ఉద్యమాలకు స్పందించి వేతనం రూ.3 వేలకు పెంచడం జరిగిందని... గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో భాగంగా ఆశా కార్యకర్తలకు రూ.10వేల వేతనం ఇస్తానని వాగ్దానం చేశారని... ప్రభుత్వం ఏర్పాటయిన మూడు నెలలకు రూ.10 వేలకు వేతనం పెంచారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కలిపి ఇస్తున్న రూ.10వేల వేతనాన్ని కనీస వేతనం చేస్తానన్న హామీ మేరకు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణం కనీస వేతనం అమలుపరుస్తూ జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాణ స్వీకారం చేసి వారం రోజులు కాకమునుపే రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలను తెలుగుదేశం పార్టీ మండల ఇన్‌ఛార్జులు వేధింపులకు గురి చేస్తున్నారని, ఉద్యోగాలు తీసివేస్తున్నామని బెదిరిస్తున్నారన్నారు. వెంటనే రాజకీయ నాయకులు వేధింపులు ఆపాలని హెచ్చరించారు. గత 16 ఏళ్లుగా కనీస వేతనం,ఉద్యోగ భద్రత, కార్మికులుగా గుర్తింపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు లేకుండా వెట్టిచాకిరీ చేస్తున్న ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీసవేతనం రూ.26 వేలతో కూడిన మెటర్నరీ సెలవులు, సాధారణ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్,పెన్షన్ ఆశా రికార్డులను, ఉచితంగా రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యూటీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని, ఆశాలు మరణిస్తే మట్టి ఖర్చులకు రూ.25 వేలు ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న లెప్రసీ, మలేరియా, ట్యూబెక్టమి, కరోనా అలవెన్సులు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 24 గంటలు అందుబాటులో ఉంటూ గర్భవతులకు, బాలింతలకు, ప్రజలకు సేవ చేస్తున్న ఆశా కార్యకర్తలకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. సచివాలయాల బదలాయింపు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యు.మరియమ్మ, కే కల్పన పాల్గొన్నారు.

జగన్ నివాసం ఎదురుగా ప్రజల రాకపోకలు సులువు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లిలోని వైసీపీ అధినేత జగన్ నివాసం ఎదురుగా ఉన్న రోడ్డుపై బారికేడ్ల తొలగింపుతో ఆ ప్రాంత ప్రజల మార్గానికి సులువైంది. ఇంతకాలం ముఖ్యమంత్రి హోదాలో జగన్ ఉన్నందున అటు వైపుగా ఎవరినీ అనుమతించలేదు. బారికేడ్లను ఏర్పాటు చేసి పూర్తిగా నియంత్రించారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రాంతంలో బారికేడ్లను తొలగించడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఆ ప్రాంత రహదారికి రెండు వైపులా పోలీసు చెక్‌పోస్టులను ఉంచి, ప్రజల రాకపోకలకు ఈనెల 16వ తేదీ నుంచి అనుమతించారు. గతంలో సీతానగరం నుంచి రేవేంద్రపాడుకు కాలువ కట్ట మార్గంలో రాకపోకలు కొనసాగేవి. దీనివల్ల ప్రజలకు కిలోమీటరుకు పైగా అదనంగా తిరిగి రావాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పుడు జగన్ నివాసం మీదుగా రాకపోకలు కొనసాగడంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోయాయి. రహదారికి రెండు వైపులా చెక్‌పోస్టులు ఉంచి ప్రజల, వాహనాల రాకపోకలకు అనుమతించారు.

22న వైసీపీ విస్తృతస్థాయి సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత జగన్ అధ్యక్షతన ఈ నెల 22న తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎమ్మెల్యేలతో సహా సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ సమాచారం పంపారు. వారితో పాటు ఎంపీలు మినహా పార్లమెంట్‌కు పోటీ చేసిన అభ్యర్థులను ఆహ్వానించనున్నారు. నేతలకు జగన్ మనోధైర్యం కల్పించనున్నారు. అసెంబ్లీ సమావేశంలో ఎలా వ్యవహరించాలి, ఏం చేయాలనే దానిపైనా చర్చించనున్నారు. టీడీపీ, జనసేన మేనిఫెస్టోలో ఇచ్చిన అంశాల అమలుపై కొంత సమయం ఇచ్చి ప్రజల్లోకి వెళ్దామని ఇప్పటికే జగన్ నేతలకు సూచించిన విషయం విదితమే. వైసీపీ ఓటమి అనంతరం ముఖ్యనేతలతో జగన్ వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్సీలు, ఎంపీలతో వేర్వేరుగా సమావేశాలను నిర్వహించి, రాబోయే రోజుల్లో చట్టసభల్లో వైసీపీ పాత్ర క్రియాశీలకంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. తొలిసారిగా నిర్వహించే పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి గెలిచిన ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. వారితోపాటు ఓటమి పాలైన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఎందరు వస్తారనేదీ ప్రశ్నార్థకంగానే మారింది. పార్టీ ఓటమి తర్వాత తూర్పుగోదావరి, విశాఖ జిల్లాకు చెందిన పార్టీకి చెందిన కాపు మాజీ ఎమ్మెల్యేలు కొందరు ఇప్పటివరకు జగన్‌ను కలవలేదు. ఈ సమావేశానికి వారు వస్తారా లేదా అనేది చూడాలి. ఎన్నికల ముందు వివిధ పార్టీల నుంచి వైసీపీలో చేరిన వారిలో ఎంత మంది నిలుస్తారనే విషయంలో అయోమయం నెలకొంది.

వైసీపీకి మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు రాజీనామా

ప్రకాశంజిల్లాకు చెందిన మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు వైసీపీకి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ అధినేత జగన్‌కు పంపారు. వ్యక్తిగత కారణాల రీత్యా పార్టీ నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. 2014లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఆయన పనిచేశారు. 2019లో ఒంగోలు టీడీపీ తరపున ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత టీడీపీకి రాజీనామా చేసి వైసీపీకి వచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలవ్వడంతో ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శిద్ధా తెలిపారు.

రుషికొండపై దుష్ప్రచారం వద్దు

రాష్ట్రపతి, గవర్నర్ల విడిదికోసం నిర్మించిన భవనాలవి: గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రుషికొండపై నిర్మించిన భవనాల విషయంలో ప్రభుత్వ ప్రతినిధులు దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. సోమవారం ఆయన ఎండాడ వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రుషికొండపై ప్రభుత్వ అవసరాల కోసం ఆయా భవనాలను నిర్మించామని, అయితే ఈ భవనాలు వైసీపీ నాయకులకు చెందినవని, వారి సొంతానికి నిర్మించుకున్నారంటూ ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రుషికొండపై గడిచిన మూడు సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, అక్కడ నిర్మాణాలు సాగకుండా పర్యావరణం పేరుతో కోర్టులకు వెళ్లారని అన్నారు. ఈ నిర్మాణాలకు ముందు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీని వేశామని, ఆ కమిటీ ఇచ్చిన సూచనల మేరకే ముందుకు సాగామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా వెలుగొందుతున్న విశాఖ నగరానికి రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, గవర్నర్లు వచ్చినప్పుడు వారికి సరైన విడిది సౌకర్యం లేదని, దీనిని దృష్టిలో పెట్టుకుని సదరు భవనాలను నిర్మించామని అమర్నాథ్ అన్నారు. అదేవిధంగా విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలని జగన్‌మోహన్ రెడ్డి భావించారని, ఈసారి అధికారంలోకి వస్తే ఇక్కడ నుంచే పరిపాలన సాగించాలన్న ఆలోచన కూడా చేశారని వివరించారు. అయితే రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగినందున ప్రస్తుత ప్రభుత్వం ఈ భవనాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలన్న ఆలోచన చేయాలని అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు. రుషికొండపై నిర్మించిన భవనాలు వీఐపీలు, వీవీఐపీలకు కేటాయించే అవకాశం ఉన్నందున భద్రతను దృష్టిలో పెట్టుకుని ఇప్పటివరకు ఆ భవనాలను బహిర్గతం చేయలేదని, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ విషయాన్ని పట్టించుకోకుండా వీటిని బహిర్గతం చేశారని అన్నారు. పర్యాటక శాఖకు సంబంధించిన ఈ భవనాలను ప్రస్తుత ప్రభుత్వం సద్వినియోగం చేసుకుంటే బాగుంటుందని సూచించారు. 2014-19 సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని పేరుతో వేల కోట్ల రూపాయలను దుర్వినియోగం చేశారన్న విషయాన్ని అమర్నాథ్ గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ ఖర్చుతో అత్యంత విలాసవంతమైన భవనాన్ని నిర్మించుకున్నారని, ఆ సమయంలో అతని కుటుంబ సభ్యులను ఒక హోటల్‌లో ఉంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన విషయం ప్రజలందరికీ తెలుసని ఆయన అన్నారు. జగన్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో అనేక మంచి పనులు చేసిందన్నారు. భోగాపురం విమానాశ్రయం, ఉద్దానంలో కిడ్నీ పరిశోధనా కేంద్రం, మూలపేట పోర్టు, రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలలు, గిరిజన విశ్వవిద్యాలయం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వాటి గురించి ఏనాడు మాట్లాడని టీడీపీ నాయకులు ఇప్పుడు రుషికొండ భవనాలపై రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, పార్టీ ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి పాల్గొన్నారు.

పేదలపై జగన్ కపట ప్రేమ: వర్ల రామయ్య

విశాలాంధ్ర-విజయవాడ: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెదవులపై మాత్రమే పేదల మాట... మనసులో సిరుల మూట... నడిచేది ధనవంతుల బాట అని విశాఖలోని రిషికొండపై నిర్మించిన మాయా మహల్‌ను చూస్తే స్పష్టంగా అర్థం అవుతుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఎద్దేవా చేశారు. మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ...భారత దేశంలో కాదు.. ప్రపంచంలో ఏ నాయకుడు తన నివాసానికి ప్రజా ధనం వెచ్చించలేదన్నారు. స్వతంత్రం వచ్చిన 77 ఏళ్లలో భారత పార్లమెంట్ నిర్మాణానికే రూ.700 కోట్లు ఖర్చు కాగా... జగన్ మాత్రం తన భార్య నివసించడం కోసం రూ.500కోట్ల ప్రజా ధనంతో రిషికొండలో మాయా మహల్ నిర్మించుకున్నారని ఆరోపించారు. ఈ నిధులతో 25వేలమంది పేదలకు ఇళ్లు నిర్మించవచ్చని చెప్పారు. అప్పటి పర్యాటక శాఖ మంత్రి రోజాకి ఎందుకు ఆ బంగ్లా కడుతున్నారో కూడా తెలియదన్నారు. అధికారం పోతుందని తెలిసి తూతూ మంత్రంగా ప్రారంభం చేసి ఫెన్సింగ్ వేశారని చెప్పారు. ఈజిప్టు మార్బుల్స్‌తో మాయా మహల్ కట్టారని... 7 స్టార్ హోటల్స్‌కు కూడా లేని కారిడార్ ఈ ప్యాలెస్‌లో ఉందన్నారు. రాష్ట్రపతి, ప్రధాని కోసం అని కొత్త నాటకం ఆడుతున్నారని, నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. వాళ్లు కూడా ఈ భవనం చూసి ఆశ్చర్యపోతారని జగన్ ప్రజాధన దుర్వినియోగాన్ని గమనిస్తారని చెప్పారు. జగన్ పేదలకు దూరంగా ఉంటారని, వారిని అసహ్యించుకుంటారని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పునరుద్ధరించాలి

గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు బీవై అంబేద్కర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ (జీపీఆర్) జాతీయ అధ్యక్షులు డాక్టర్ భీమరావు యశ్వంత్ (బీవై) అంబేద్కర్ అన్నారు. వెనుకబడిన కులాలకు ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన నిబంధనలు, రక్షణలు భారత రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పొందుపరిచారని కొనియాడారు. తాడేపల్లి బ్రహ్మానందపురంలో సోమవారం గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ-ఆంధ్ర ప్రదేశ్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా బీవై అంబేద్కర్ విచ్చేశారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నేతలతో కలిసి ఆయన కార్యాలయాన్ని ప్రారంభించారు. బీవై అంబేద్కర్ మాట్లాడుతూ రాజ్యాంగ ఆధారంగా ఈ వర్గాల ప్రజల అభివృద్ధి కోసం రాష్ట్ర పరిధిలోని శాస్త్ర, ఆర్థిక, రాజకీయ, విద్యా, సాంస్కృతిక, సేవల రంగంలో రక్షణగా ఉన్నాయన్నారు. దేశ, విదేశాల్లోని అన్ని రకాల ప్రభుత్వ స్కాలర్‌షిప్‌ల పునరుద్ధరణ, అమలు కోసం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీల కోసం ఆదాయ స్లాబ్ తప్పనిసరిగా పెంచాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో బౌద్ధ కాన్సెప్ట్ స్కూళ్లు, విహారాల కోసం ఐదు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. బౌద్ధులకు ప్రత్యేక స్మశాన వాటికలను నిర్మించాలని, బౌద్ధం తీసుకున్న వారిని అధికారికంగా గుర్తించి వారికి కుల ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జీపీఆర్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చెన్నకేశవులు, బీఎస్ఐ, ఎస్ఎస్‌డీ రాష్ట్ర అధ్యక్షులు బేతాళ సుదర్శనం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నూతలపాటి జగదీశ్, భారతీయ బౌద్ధ మహాసభ జాతీయ కార్యదర్శి మనోజ్ చంద్రకాంత్, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ కో-ఆర్డినేటర్ ఏవీ స్వామి, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, సమతా సైనిక్ దళ్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ ఫెడరేషన్, బహుజన ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జగన్‌పై ప్రేమ ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేయండి

అధికారులకు సూచించిన హోం మంత్రి అనిత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వైసీపీ హయాంలో కొంతమంది పోలీసులు అధికార పార్టీ తొత్తులుగా వ్యవహరించారని, ఇప్పటికీ వారిలో వైసీపీ రక్తం ప్రవహిస్తున్నట్లుగానే వ్యవహరిస్తున్నారని, మీకు ఇంకా జగన్‌పై ప్రేమ ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేసిన ఆ పార్టీ కోసం పని చేసుకోవాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. సింహాచలం అప్పన్నను మంత్రి సోమవారం ఉదయం దర్శించుకున్నారు. పూర్ణకుంభంతో ఘనంగా ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం, గర్భగుడిలో ప్రత్యేక పూజలు, వేదాశీర్వచనం వంటివి ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకున్నట్లు తెలిపారు. శాంతిభద్రల విషయంలో ఎవరు తప్పు చేసినా వదిలే ప్రసక్తే లేదన్నారు. ముఖ్యంగా మహిళలకు అన్యాయం జరగకుండా చూసుకుంటామని, అవసరమైతే వారి తరపున పోరాడతానని తెలిపారు. సింహాచలం దేవస్థానం భూములు ఒక్క గజం కూడా అన్యాక్రాంతం కాకుండా చూస్తానన్నారు. పంచగ్రామాల భూ సమస్య పరిష్కారం కూడా త్వరలో జరుగుతుందని అనిత తెలిపారు. నగరంలో గవర్నర్ బంగ్లాలో సాయంత్రం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి అనిత మాట్లాడుతూ ఇకపై దిశ పోలీస్ స్టేషన్లను మహిళా పోలీసు స్టేషన్లుగా మార్చుతున్నామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో విశాఖలో విచ్చలవిడిగా గంజాయి వ్యాపారం, తరలింపు జరిగిందన్నారు. రాష్ట్రంలో, విశాఖలో హింసకు ప్రధాన కారణం గంజాయియేనని, క్రీ లీఫ్స్ పేరుతో ఆన్ లైన్ వేదికగా విక్రయాలు జరపటం విచారకరమని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య విధానాల వల్ల 1,230 మంది గంజాయి కేసుల్లో ఇరుక్కున్నారని, ఐదు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చారని తెలిపారు. పోలీసులకు కనీస వసతులు కల్పించలేదని, అకాడమీ ఏర్పాటుకు దృష్టి సారించలేదన్నారు. విశాఖ నగరంలో 1700 సీసీ కెమేరాల్లో సగానికి పైగా పని చేయకపోవటం విడ్డూరంగా ఉందని అన్నారు.

సంపాదకీయం

గంగలో కలిసిన సంప్రదాయం

విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ 1989లో ప్రధానమంత్రి అయినప్పుడు ఓ విచిత్రమైన సంఘటన చోటు చేసుకుంది. 1989 నవంబర్ ఎన్నికలకు ముందే నేషనల్ ఫ్రంట్ ఏర్పడింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అతి పెద్ద పార్టీగా అవతరించింది తప్ప ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి తగినంత మెజారిటీ సాధించలేకపోయింది. ఎన్నికలకు ముందే బోఫోర్స్ కుంభకోణం, రాజీవ్ గాంధీ ప్రభుత్వంలో అవినీతి లాంటి అంశాలను లేవదీయడంద్వారా విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ జనంలో మంచి పలుకుబడి సంపాదించారు. తీరా ప్రభుత్వం ఏర్పాటుచేసే దశ వచ్చేసరికి దేవీలాల్, చంద్రశేఖర్, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ మధ్య ప్రధాని పదవి కోసం పోటీ ఏర్పడింది. చివరకు పార్లమెంటరీ పార్టీ సమావేశంలో దేవీలాల్‌ను పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎన్నుకున్నారు. కానీ ఆయన వెంటనే లేచి నేను కాదు విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు అని ప్రకటించేశారు. ఆ రకంగా విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రధాన మంత్రి అయిపోయారు. ఇలా విశ్వనాథ్ ప్రతాప్ సింగ్‌ను పార్లమెంటరీ పార్టీ నాయకుడిని చేయడం మీద ఆ రోజుల్లో తీవ్రమైన విమర్శలే వచ్చాయి. అయితే రాజీవ్ గాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకంచేసి, అవినీతికి వ్యతిరేకంగా పోరాడడంలో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్‌దే ప్రధాన పాత్ర. అందుకని ఆయన ప్రధానమంత్రి కావడమే నైతికంగా సరైంది. ఒక రాజకీయ పార్టీ ఎన్నికలలో సంపూర్ణమైన మెజారిటీ మాత్రమే కాదు అద్వితీయమైన మెజారిటీ సాధించినప్పుడు కూడా ఎక్కువ సీట్లు గెలిచిన పార్టీ పార్లమెంటు సభ్యులందరూ సమావేశం అవుతారు. పార్లమెంటరీ పార్టీకి ఒక నాయకుడిని ఎన్నుకుంటారు. ఆ తరవాత ఫలానా వారిని పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎన్నుకున్నామని, ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవకాశం ఇవ్వాలని రాష్ట్రపతిని అభ్యర్థిస్తారు. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎన్నికైన వ్యక్తికి సభ మద్దతు ఉంటుందన్న నమ్మకం కలిగితే రాష్ట్రపతి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆ వ్యక్తిని ఆహ్వానిస్తారు. ఇది స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి కొనసాగుతున్న సంప్రదాయం. ఆనవాయితీ. 1962లో నెహ్రూ హయాంలో కాంగ్రెస్‌కు 361 స్థానాలు వచ్చినప్పుడూ, 1984లో రాజీవ్ నాయకత్వంలో కాంగ్రెస్‌కు 404 సీట్లు వచ్చినప్పుడు కూడా పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగడం, నాయకుడిని ఎన్నుకోవడం, ఆ విషయాన్ని రాష్ట్రపతికి లిఖిత పూర్వకంగా తెలియజేయడం, రాష్ట్రపతి సదరు నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆహ్వానించే ఆనవాయితీ కొనసాగుతూనే ఉంది. ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా, లేదా ఏ ఐక్య సంఘటన అధికారంలోకి వచ్చినా లేదా మైనారిటీ ప్రభుత్వం ఏర్పాటు చేయవలసిన అగత్యం వచ్చినా ఇదే ఆనవాయితీ కొనసాగింది. అలా కొనసాగడం సంప్రదాయమో, ఆనవాయితీనో మాత్రమే కాదు. అది నిఖార్సైన ప్రజాస్వామ్య విధానం. మనం అనుసరిస్తున్నది పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానం. అందువల్ల ఈ పద్ధతి అనుసరించడం ప్రజాస్వామ్యానికి అనుకూలమైంది. సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు కూడా ప్రధానమైన పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి తాము మద్దతు ఇస్తున్నామని సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షాలయ్యే పార్టీలన్నీ లిఖిత పూర్వకంగా రాష్ట్రపతికి తెలియజేస్తాయి. ఈ భరోసా ఆధారంగానే రాష్ట్రపతి ఎక్కువ మంది సభ్యుల మద్దతు ఉందనుకున్న నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆహ్వానిస్తారు.

సంప్రదాయాలు, ఆనవాయితీలు, నియమ నిబంధనలు పాటించే వారికే వర్తిస్తాయి. వాటి బాదరబందీ పెట్టుకోని నాయకులు ఈ మర్యాదలు పాటించరు అని నరేంద్ర మోదీ మరోసారి రుజువు చేశారు. మొదటిసారి ప్రధానమంత్రి అయిన తరవాత పార్లమెంటు భవనంలోకి ప్రవేశించే సమయంలో మోదీ పార్లమెంటు భవనం మెట్లకు నమస్కారం చేశారు. మొన్న రాజ్యాంగాన్ని కళ్లకద్దుకున్నారు. మోదీకి, ఆయన పార్టీకి, ఆ పార్టీ మాతృసంస్థకు రాజ్యాంగంమీద ఏ నాడూ నమ్మకం లేదన్నది వేరే విషయం. కానీ ఉన్న పద్ధతుల ఆధారంగా అధికారం చేపడ్తున్నప్పుడు అంతవరకు ఉన్న సంప్రదాయాలను, ఆనవాయితీలను పాటించి తీరవలసిందే. వారం రోజుల కింద మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణం స్వీకారం చేశారు. అంతకు ముందు రాష్ట్రపతి ముర్ము మోదీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆహ్వానిస్తూ అందజేసిన లేఖను మోదీ "సగర్వంగా" ప్రదర్శిస్తున్న ఫొటోలు విరివిగా ప్రచారంలోకి వచ్చాయి. నిజానికి మోదీనే వాటిని ప్రచారంలో పెట్టారు. తాము ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని కొంతమంది సీనియర్ నాయకులను వెంటబెట్టుకుని మోదీ రాష్ట్రపతికి విన్నవించిన మాట వాస్తవమే. ఆయన ఏ సంప్రదాయం లేదా ఏ అధికారం ఆధారంగా రాష్ట్రపతికి ఈ విషయం చెప్పారో తెలియదు. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా కనీసం ఆయన సొంతపార్టీ ఆయనను ఎన్నుకోలేదు. ఆ పార్టీకి మద్దతిస్తున్న పార్టీలన్నీ కలిసి పార్లమెంటు సభ్యులందరినీ సమావేశ పరిచి ఎన్నుకున్న దాఖలాలూ లేవు. ఈ ఎన్నికల్లో మోదీ నాయకత్వంలోని బీజేపీకి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావలసినంత మంది బీజేపీ ఎంపీలు ఎన్నికకాలేదు. తెలుగు దేశం, జె.డి.(యు) తాము బీజేపీకి మద్దతు ఇస్తామని రాష్ట్రపతికి లేఖ పంపించిన మాటా వాస్తవమే. కానీ మోదీని పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎన్నుకున్న సమావేశం, ప్రక్రియ మాత్రం మాయమై పోయాయి. సర్వ వ్యవస్థలను ఛిద్రం చేసిన మోదీ హయాంలో ఈ సుకుమారమైన సంప్రదాయాన్ని పాటించకపోవడంలో ఆశ్చర్య పడనవసరంలేదు. ఇటీవలి ఎన్నికల్లో బీజేపీకి ప్రభుత్వం ఏర్పాటుచేసే అవకాశం వస్తే మోదీనే ప్రధానమంత్రి అన్న అభిప్రాయం సర్వత్రా ఉండొచ్చు. కానీ ఈ మధ్య కాలంలో ఆ పదవిని ఆశించిన మరి కొందరు కూడా ఉన్నారు, అందుకే ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదు అన్న వదంతులు నిజమనుకునేంత బలంగా వినిపిస్తున్నాయి. అలాంటప్పుడు పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగడం, నాయకుడిని ఎన్నుకోవడం, ఆ విషయం రాష్ట్రపతికి సాధికారికంగా తెలియజేడం లాంటివి జరిగితే బాగుండేది. కానీ అవేవీ లేకుండానే మోదీ ప్రధానిగా ప్రమాణం స్వీకరించేశారు. దీనివల్ల ఆయన పదవి పదిలంగా ఉందా లేదా అనేది ఇక్కడ ప్రధానం కాదు. సంప్రాదాయాన్ని, కట్టుబాట్లను, ఆనవాయితీలను పాటించారా లేదా అన్నదే ముఖ్యం. చట్టాలకన్నా ఆనవాయితీలకు బలం ఎక్కువ. ఆనవాయితీ పాటించకుండా మోదీ ప్రధానమత్రి కుర్చీలో ఆసీనులైపోయారు. మోదీ ఏలుబడిలో ఏదైనా సాధ్యమే. పార్లమెంటు మెట్లకు మొక్కడం, రాజ్యాంగాన్ని కళ్లకు అద్దుకోవడం లాంటివి వెర్రి జనాన్ని నమ్మించడానికే. ఈ విధి విధానాలను, పద్ధతులను మోదీ పనిగట్టుకుని ఉల్లంఘించారా లేదా ఎక్కడైనా పొరపాటు జరిగిందా అన్న చర్చకు తావే లేదు. ఎందుకంటే ఇలాంటి సందర్భంలో ఏర్పాట్లుచేసే బాధ్యత ఉన్న అధికారవర్గం సొంత నిర్ణయాలు తీసుకుని విధి విధానాలను ఉల్లంఘించే సాహసం చేయలేదు. చేయదు. ఇది పూర్తిగా మోదీ ధిక్కార ధోరణే.

దెబ్బకు రా....

చింతపట్ల సుదర్శన్

తిని తొంగోడంతోపాటు కూసింత కళాపోషణ చెయ్యాలనుకుంటారు మనుషులు, మరి తమరూ తిని తొంగోవడంతోపాటు తమ కళ అదే భౌభౌ కళను కాస్త పోషించవచ్చు కదా! అంది డాంకీ. అప్పటికే ఊరంతా బలాదూర్ తిరిగి, అలసివచ్చిన డాగీకి అనీజీగానూ, చిరచిరగానూ ఉంది. మనుషుల్లో ప్రతి వాడూ పక్కనోడి తలమీద ఎక్కి కూచుందామనుకునే వాడే. కానీ ఈ డాంకీకి ఆ మాయరోగం అంటినట్టుంది. అయినా అనవసరంగా అస్తమానం మంత్రి పదవిరాని రాజకీయ నాయకుడిలా భౌ భౌ మనడమేనా, అయిందానికీ కాని దానికీ అనే డాంకీ, నన్ను భౌ భౌ మనాలని రెచ్చగొడుతున్నది. ఎందుకో అనుకున్న డాగీ ఆ మాటే అడిగేసింది.

అవసరం వచ్చింది కదా అని శిరోభారమైనా అదే తలనొప్పయినా అడక్క తప్పింది కాదు తంబీ. ఊళ్లో చెడ్డీ గ్యాంగ్ దొంగలు, మధ్యప్రదేశ్ దొంగలు తిరుగుతున్నార్ట. దొంగల్ని పట్టుకునేందుకు పోలీసుల్తోపాటు కుక్కలు కూడా పనిచెయ్యటం ధర్మం కదా మరి. ఓహో అదా సంగతి చెడ్డీ గ్యాంగు, బనియన్ గ్యాంగులూ వస్తే చూసుకోవలసింది పోలీసులే. వాళ్లు పెట్రోలింగ్ వ్యానుల్లో మందేసి నిద్దరోతే, కుక్కలు అరవాలా

రంగస్థలం

మాకేమన్నా జీతాలా, భత్యాలా. వాళ్లకూ వాళ్లకూ అండర్‌స్టాండింగుంటుంది లే అంది డాగీ ఆవులిస్తూ.

అలాగనకు తమ్ముడూ. ఆ గ్యాంగోళ్లు చెడ్డీలు ఊపుకుంటూ బనీన్లు చింపుకుంటూ మన ఇంటిమీదికి కూడా రావచ్చు కదా. మన ఇంటిమీదికా ఏముందిక్కడ కూలిన గోడలు, రాలే మట్టితప్ప. ఇదేమన్నా పాతిక లక్షల బాత్ టబ్బూ, లక్షల రూపాయల టొయిలెట్ కుండీలు, అనేక రూపాయల ఖరీదుచేసే ఫ్యాన్లూ, షాండిలర్లు ఉన్న ప్యాలెస్సా, అవన్నీ రాజ్యాల్ని ఏలినోళ్లకుంటయి. ఏలుబడి అయ్యాక వారు అనుభవించిన అలౌకిక ఆనందాలన్నీ తీరుబడిగా ప్రజలకు తెలుస్తయి. మా కష్టార్జితం ఇంత బాగా ఉపయోగపడిందా? ఏలినవారికి అని నోళ్లు తెరచి ముక్కులు మూసుకుంటారు అంది డాగీ.

నువ్వన్నది అక్షరాలా నిజమేననిపిస్తుంది. నా దగ్గిర వేస్టు పేపర్లూ, నీ దగ్గర నవిలేసిన ఎముక తప్ప ఏం దొరుకుతుంది. దొంగలకి చెడ్డీ లేసుకువచ్చినా, బనియన్లు చింపుకుంటూ వచ్చినా, జీతాలు తీసుకుంటున్నా ఉద్యోగులని పించుకోకుండా, ప్రజాసేవకులని పిలిపించుకుంటూ రాజులు కాకపోయినా రాజభోగాలు అనుభవిస్తూ, అవసరం లేకపోయినా అనేకమంది సలహాదారులనుమేపుతూ, అయిన వాళ్లందరికీ నామినేటెడ్ పదవులిచ్చి కాళ్లు ఒత్తించుకుంటూ ఉండే వాళ్ల మీద పడాలి దొంగలు కాని అప్పులుచేసి ఇళ్లు కట్టుకుని, ఇరుగూపొరుగూ కోసం నగలు కొనే వాళ్లమీద పడ్డం న్యాయంకాదు కదా అంది డాంకీ.

న్యాయం, ధర్మం అనే మాటలు ఇప్పటి వాడుకభాషలో లేవు సుమా. తన్నుమాలిన ధర్మమే లేదను పాతమాటే ఇప్పుడు బేషరతుగా వాడుకలోకి వచ్చింది. ఇక దొంగల సంగతికొస్తే, వాళ్లకి తమ వృత్తి పట్ల ఇంకా బాగా గౌరవం ఉన్నట్టుంది అందుకే తమ జాతివాళ్ల ఇళ్లవైపు పోరు బడాయిమాటలు వద్దు, వృత్తి గౌరవం వంటివి మరీ బరువైన మాటలు. నువ్వు ఉద్దేశించిన ఘరానాదొంగలు, ప్రజాసేవకులవడంవల్ల బోలెడంత 'సెక్యూరిటీ' కలిగి ఉంటారన్న కారణంచేత వారి కొంపలవైపు సారీ కోటలవైపు వీరు పోరు అంది డాగీ.

దొరలుగా చెలామణీ అయ్యే దొంగలుగా మారడానికి ఎంతో కృషి అవసరం. ప్రజల సొమ్ముతో తమని తాము అభివృద్ధి చేసుకుంటూ ప్రజాపాలన చేస్తున్నామని పంచుకోడానికి, రాచరికమూ, ప్రజాస్వామ్యమే అని భ్రమకలిగించడానికి ఎంతో శ్రమ అవసరం. అలాగ కృషించీ, శ్రమించీ సంపాదించుకున్న దాన్ని ఒక్క రోజులో ప్రజలు 'పీకి పాకం' పెట్టడం చెయ్యగలరు అన్న విషయం నమ్మశక్యంకాని విషయమే అయినా విషంలా మింగక తప్పని పరిస్థితి. ఏ 'పిత' కైనా, ఏ బాబుకైనా ఏ బ్రదర్‌కైనా తప్పదు. స్వానుభవమైతే తప్ప సొంత బ్రాండ్ సారాలో కొట్టుకుపోక తప్పదు అన్న విషయం తెలిసి రాదు అని డాంకీ అంటుండగ అరుగు ఎక్కాడు అబ్బాయి.

ఊళ్లోకి దొంగల గ్యాంగులు దిగాయంట. తొందరగా వెళ్లాలి అంటూ తన జాగాలో కూచున్నాడు. అయితే అన్నా అయిదేళ్లకోసారి ప్రజలు దొంగల్ని దొరలుగా మారుస్తారు కదా, ఆ దొరలు దొరతనం పోయేక మళ్లీ అయిదేళ్లదాకా ఏం చెయ్యాలి గోళ్లు గిల్లు కోవాలి అంది డాగీ. గోళ్లు గిల్లుకోడం ఎందుకూ? కళ్లు మూసుకుంటే సరి. ఈ మధ్య ఓ లీడరు చెప్పిన శ్రీరంగనీతుల్లో ఇది ఒకటి. ఐదేళ్లు అలా కళ్లు మూసుకుంటే ఇలా ఎన్నికలు వచ్చేస్తయి. అప్పుడు మళ్లీ మనమే దొరలమై ఏలుదాం అన్నది ఆ నీతి. కళ్లు మూసుకోవలసింది ఎవరు ప్రజలా? అంది డాంకీ. కాదు మళ్లీ మళ్లీ దొరతనం కలలుకనే వారు. ప్రజలు కళ్లు మూసుకోరు. పిల్లి కళ్లు మూసుకున్నట్టు మూసుకుని తమను ఎవరూ ఏమీ చేయరు అనుకునే వాళ్లేవాళ్ల దెబ్బకు 'రా' అంటారు అన్నాడు అబ్బాయి.

దెబ్బకు రా! దొంగల ముఠా! అన్నమాట
భలే భలే..అంది డాగీ.

సవాళ్ల నేపథ్యంలో బ్రిటన్ ఎన్నికలు

చవేరా

బ్రిటన్ పార్లమెంటు ఎన్నికలు జులై 4న జరుగనున్నాయి. ఆ దేశ ప్రధానమంత్రి, కన్సర్వేటివ్ పార్టీ నాయకుడు రిషి సునాక్ ఆకస్మికంగా ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించాడు. ఈ ఎన్నికలు 14 ఏళ్ల టోరీల పాలనకు అగ్ని పరీక్ష వంటిది. మొత్తం బ్రిటన్ పార్లమెంటు దిగువసభకు 650 మంది ప్రతినిధులు ఎన్నిక కావల్సిఉంది. లేబరు పార్టీ ప్రతిపక్షంలో ఉంది. జనవరి వరకు సాధారణ ఎన్నికలకు గడువు ఉన్నప్పటికి దేశంలోని ఆర్థిక, అంతర్గత పరిస్థితుల నేపథ్యంలో రిషి ముందస్తు ఎన్నికలకు సిద్ధమయ్యారు. వాస్తవంగా సునాక్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభంనుంచి బ్రిటన్ పెట్టుబడిదారీ ఆర్థికస్థితి ఇంకా కోలుకోలేదు. ఉద్యోగుల వేతనాల పెరుగుదల ఆగిపోయింది. ప్రభుత్వ ఖర్చులపై సైతం కోత పెట్టవలసి వచ్చింది. ప్రజలు రోజురోజుకు రుణాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆ దేశంలో కార్మికుల ఆందోళన పెరిగిపోయి, వారిపై దాడులు నిత్యకృత్యమయ్యాయి. కార్మికుల జీవితాలను పణంగాపెట్టి పెట్టుబడిదారులు బాగుపడాలని భావిస్తున్నారు.

కన్సర్వేటివ్ పార్టీ 2010 నుంచి అధికార పీఠంపై ఉంది. 2010 సాధారణ ఎన్నికలలో డేవిడ్ కామెరూన్ నేతృత్వంలో అత్యధిక స్థానాలను సాధించింది. ఆ తర్వాత నిక్‌క్లెగ్ నాయకత్వం వహించారు. 2015 లో స్వల్ప మెజారిటీతో కన్సర్వేటివ్ పార్టీ గట్టెక్కింది. 2016 బ్రెగ్జిట్ రెఫరెండమ్ నేపథ్యంలో కామెరున్ ప్రధానిగా రాజీనామా చేశారు. అప్పుడు థెరిస్సా మే దేశానికి నాయకత్వం వహించారు. 2017 లో కన్సర్వేటివ్ మెజారిటీ కోల్పోగా "డెమొక్రటిక్ యూనియనిస్టు పార్టీ ఆఫ్ నార్థన్ ఐలాండ్" మద్దతుతో మైనారిటీ ప్రభుత్వం పాలనాపగ్గాలు చేపట్టింది. ఎన్నో ఒడిదుడుకుల మధ్య 2019 లో థెరిస్సా మే రాజీనామా చేసేవరకు ఈ ప్రభుత్వం సాగింది. 2019 నుంచి బోరిస్ జాన్సన్ నాయకత్వంలో ప్రభుత్వం సాగింది. 2019 నుంచి ఇప్పటివరకు ముగ్గురు ప్రధాన మంత్రులుగా పనిచేశారు. 2022 సెప్టెంబరు నుంచి అక్టోబరు వరకు అతి స్వల్పకాలంపాటు లిజ్‌ట్రస్ ప్రధానిగా ఉన్నారు. అక్టోబరు 22, 2022 నుంచి రిషి సునాక్ ఇప్పటి వరకు పాలిస్తున్నారు. చివరి ముగ్గురి పాలనాకాలంలో దేశంలో అనేక ఉన్నతస్థాయి కుంభకోణాలు వెలుగు చూశాయి. రెండు ప్రభుత్వ సంక్షోభాల వల్ల కన్సర్వేటివ్‌లు తమ ప్రాబల్యం కోల్పోయారు. దీనికి తోడు 2022 లో జరిగిన స్థానిక ఎన్నికలలో లేబరు పార్టీ పుంజుకుని 108 సీట్లలో గెలుపొందింది. 2023 ఎన్నికలలో లేబరు పార్టీ అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. 2024 స్థానిక ఎన్నికలలో మరిన్ని విజయాలను సాధించి తన స్థానాన్ని పదిలపర్చుకుంది. కన్సర్వేటివ్ పార్టీ కంటే ఎక్కువ విజయాలను మూట కట్టుకుంది. ఈ పూర్వ రంగంలో ఇప్పుడు పార్లమెంటుకు ముందస్తు ఎన్నికలు జరుగుతున్నాయి.

కన్సర్వేటివ్ పార్టీకి 190 సంవత్సరాల చరిత్ర ఉంది. మొదట దాని పేరు టోరి. 112 ఏళ్ల క్రితమే కన్సర్వేటివ్ పార్టీగా పేరు మార్చుకుంది. ఐనా టోరీలు అని వ్యవహరించటం సాధారణ విషయం. ప్రస్తుత ప్రధాన

మంత్రి రిషి సునాక్ భారతీయ మూలాలు ఉండి బ్రిటన్‌లో స్థిరపడిన వ్యక్తి. ప్రస్తుత పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రానికి చెందినవారు. భారత పారిశ్రామిక దిగ్గజం ఇన్ఫోసిస్ నారాయణమూర్తి కుమార్తె అక్షిత లండన్‌లో చదువుకుంటూ రిషిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇటీవలకాలంలో టోరీల పాలనలో బ్రిటన్ తీవ్ర అస్థిరతకు గురైంది. ఆర్థిక, రాజకీయ సామాజిక రంగాలలో ఈ అస్థిరత కొట్టవచ్చినట్లుగా కన్పిస్తున్నది. ఆరేళ్లలో ఐదుగురు ప్రధాన మంత్రులు మారిపోయారంటే ఈ అస్థిరత ఎంత ఎక్కువగా ఉందో అర్థం అవుతుంది.

ఇంగ్లండ్, స్కాట్‌లాండ్, వేల్స్, నార్తరన్ ఐర్లాండ్ ప్రాంతాలుగా ఉన్న బ్రిటన్‌లో మార్పుకోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, లేబరు పార్టీ అధికారంలోకి వస్తుందని ఒపీనియన్ పోల్స్ చెబుతున్నాయి. ఈ ఎన్నికలలో 4 కోట్ల 70 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కన్సర్వేటివ్ పార్టీ గెలిస్తే ఇమ్మిగ్రేషన్ స్థాయిలను తగ్గిస్తామని ప్రధాని రిషి సునాక్ ఎన్నికల ప్రచార సభలో వాగ్దానం చేస్తున్నారు. బ్రిటన్‌లో ఇమ్మిగ్రేషన్ అనేది చాలా కాలంగా ఒక ప్రధాన రాజకీయ సమస్యగా ఉంది. వలస వచ్చే వారి వల్ల గృహ నిర్మాణం, విద్య, ఆరోగ్య రంగాలపై తీవ్ర ప్రభావం పడుతున్నది. తీవ్రమైన ఒత్తిడి కారణంగా సామాజిక ఐక్యతకు విఘాతం కలిగి గందరగోళ పరిస్థితులు తరుచుగా ఏర్పడుతున్నాయి. ఇతర యూరోపియన్ దేశాల నుంచి స్వేచ్ఛగా బ్రిటన్‌లోకి వచ్చే వారిని కట్టడి చేయాలని ప్రభుత్వం భావించినా 2015 నుంచి బ్రిటన్‌కు వలసలు ఏటికేడు పెరుగుతూనే ఉన్నాయి. 2023లో ఆరు లక్షల 85 వేల మంది బ్రిటన్‌కు వలసలు వచ్చారు. ప్రధానంగా ఉన్నత విద్యకోసం ఎక్కువమంది విద్యార్థులు వస్తున్నారు. ఈ విద్యార్థులకు సంరక్షకులుగా సైతం పెద్ద సంఖ్యలో వస్తున్నారు. దీనిని నిరోధించేందుకు ప్రధాని సునాక్ కొన్ని చర్యలు తీసుకున్నప్పటికి ఫలితం కన్పించటంలేదు. దీనికి తోడు యూరప్ నుంచి చిన్నచిన్న పడవలలో అనుమతి లేకుండా శరణార్థులు బ్రిటన్‌లోకి చొరబడుతున్నారు. ఈ కారణంగా బ్రిటన్‌లో ఇళ్ల అద్దెలు అడ్డూ అదుపులేకుండా పెరిగిపోతున్నాయి. ఆర్థిక వెసులుబాటు తగ్గి ప్రభుత్వం బలహీన వర్గాల గృహనిర్మాణ పథకాన్ని రద్దు చేసింది. దేశ జనాభా 6.7 కోట్లు ఉంటే సుమారు కోటిన్నర మంది వరకు దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారని సర్వేలు చెబుతున్నాయి. దేశంలో మూడు లక్షల కుటుంబాలకు అసలు నివాస గృహాలే లేవు. ఇళ్లు లేనివారికి చట్ట ప్రకారం 6 మాసాల పాటు ప్రభుత్వం నివాసం కల్పించాల్సి ఉంది. ఇళ్లులేక వీధుల పక్క వివిధ ప్రాంతాలలో తల దాచుకుంటున్న పేదలపై 1000 పౌండ్ల జరిమానా విధిస్తున్నారు. దేశంలో ద్రవ్యోల్బణం పెరిగి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. జీవన వ్యయం ఎప్పటికప్పుడు పెరిగిపోతున్నది. ఉచిత ఆహార పొట్లాలకు డిమాండ్ బాగా పెరిగింది. సునాక్ పాలనలో వారి సంఖ్య వేల స్థాయి నుంచి లక్షల స్థాయికి పెరిగిపోయింది. దీనితో శరణార్థుల పట్ల బ్రిటన్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తున్నది. శరణార్థులను పట్టుకుని రువాండ దేశం తరలిస్తున్నారు. అక్కడ వారికి బ్రిటన్‌లో ఆశ్రయం ఇవ్వాలా వద్దా అనే విషయం నిర్ధారించి పంపిస్తున్నారు. ఇష్టమైనవారు రువాండాలో ఉండవచ్చును లేక ఏ దేశమైనా వెళ్లవచ్చును. అర్హులైన వారిని మాత్రమే బ్రిటన్‌కు అనుమతి ఇస్తున్నారు. ఈ రకంగా రువాండాతో ఒప్పందం చేసుకుని వేలకోట్ల పౌండ్లు వారికి చెల్లిస్తున్నారు. ఇంగ్లీషు ఛానల్ దాటి వచ్చేవారు పట్టుబడి వెనక్కు తిరిగి వెళితే వారికి 3 వేల పౌండ్లు ఖర్చులు కింద ఇస్తున్నారు. ఈ సమస్యలన్నీ ప్రస్తుత ఎన్నికలను ప్రభావితం చేయనున్నాయి.

బ్రిటన్ ఎన్నికలలో ఎవరు గెలిచినా ఆర్థిక వ్యవస్థలోని ఒడిదుడుకులను ఎదుర్కోవలసి ఉంటుంది. 2016 లో యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ బయటకు రావటం, గ్రూప్ ఆఫ్ సెవన్‌లో యు.కె. ఆర్థికరంగం బలహీనంగా ఉండటం, ఇంధన ధరలు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా పెరిగిపోవటం, కోవిడ్ ప్రభావం నుంచి ఇంకా కోలుకోలేని పరిస్థితులు, కార్మికుల, వేతన జీవుల అసంతృప్తి, సమ్మె, ఆందోళనలు ఈ ఎన్నికలలో తీవ్ర ప్రభావాన్ని చూపించనున్నాయి. దీనికి తోడు ఆహార ధరల పెరుగుదల అగ్నికి ఆజ్యం తోడైనట్లు ప్రజల అసంతృప్తిని రెట్టింపు చేసింది. దీనితో ఆసుపత్రులు, పాఠశాలలో సమ్మెలు జరిగాయి. దీనివలన దేశ ఆర్థికవ్యవస్థ మరింతగా కుదించబడి పొదుపు చర్యలకు ఉపక్రమించవలసి వచ్చింది. ఆర్థిక వ్యవస్థలోని సేవలు, తయారీ, నిర్మాణ రంగాలు క్షీణించి నిరుద్యోగం పెరిగిపోయింది. దేశమంతా అసంతృప్తి జ్వాలలు రగులుకుంటున్నాయి. ప్రజలు విసిగి, వేసారిపోయారు. ప్రభుత్వ పొదుపు విధానం పట్ల అసంతృప్తితో ఉన్నారు. ప్రభుత్వ విధానాలు వేలాది మంది మృతికి దారితీశాయి. దీనికి తోడు రిషిసునాక్ కుటుంబ సంపద రెండేళ్లలో 12 కోట్ల నుంచి 65.1 కోట్ల పౌండ్లకు పెరిగిందనే కారణంగా ప్రధాని ప్రజాభిమానాన్ని కోల్పోతున్నారు. అందుకే 2024 బ్రిటన్ ఎన్నికలు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. 2020 యూరోపియన్ యూనియన్ నుంచి విడివడిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవి.

సెల్: 9392711999

ఈ తీర్పు దేనికోసం...

డాక్టర్ సి.క్షేత్రపాల్ రెడ్డి

సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసింది. గత పదేళ్లుగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పార్లమెంటులో తమకున్న మందబలంతో ఇష్టానుసారం చలరేగి పోయింది. ప్రజ్యాస్వామ్యానికి పాతరేస్తూ పాలన సాగించింది. ప్రజా వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తూ కన్ను మిన్ను కానకుండా వ్యవహరించింది. ఈసారి తమకే 370 సీట్లు, తమ కూటమికి 400 పైగా సీట్లు అంటూ మేకపోతు గాంభీర్య ప్రదర్శన చేసింది. రాజ్యాంగాన్ని మార్చేస్తాం, రిజర్వేషన్లను రద్దు చేయడం తమ భవిషత్తు కర్తవ్యం అంటూ బీజేపీ నేతలు బాహాటంగానే ప్రకటనలు చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీకి పూర్తి మెజారిటీ లభిస్తే ఏకంగా రాజ్యాంగానికే ఎసరు పెట్టేస్తుందని పసిగట్టిన విజ్ఞత కలిగిన ఓటర్లు బీజేపీకి కళ్లెం వేశారు. ఆ పార్టీని సొంతంగా పాలన చేయలేని స్థితిలోకి నెట్టేసి మిత్రపక్షాలపైనే ఆధార పడేలా గొప్ప గుణపాఠం చెప్పారు. తాను దైవదూతనని దేవుడు పంపాడని ప్రచారం చేసుకొని అహంకారం తలకు ఎక్కించుకున్న మోదీని నేల చూపులు చూసేలా తీర్పునిచ్చారు.

గతంలో బీజేపీ గెలిచిన 303 సీట్ల నుంచి ఓటర్లు 63 సీట్లను లాగేసి ఇకనైనా బుద్ధి తెచ్చుకొని సంకీర్ణ ప్రభుత్వ పాలన చేయమని ఆదేశించారు. రాముడిని అడ్డంపెట్టుకొని మతతత్వ రాజకీయాలకు పాల్పడిన ఆ పార్టీని అయోధ్య రామాలయం కొలువై ఉన్నచోటనే ఓడించి లౌకికవాదానికే భారతీయులు కట్టుబడివున్నారని నిరూపించారు. మతం ప్రజల వ్యక్తిగతం, పాలకుల చేతిలో ఆయుధంగా ఉండడానికి వీలులేదని స్పష్టం చేశారు. 370 ఆర్టికల్ రద్దు తప్పుఅని తేల్చి చెప్పారు. గవర్నర్‌లను అడ్డం పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వాలపై చేసిన పెత్తనాన్ని నిరసించారు. ప్రభుత్వ ఆస్తుల అమ్మకాన్ని సహించం అన్నారు. వాగాడంబర నినాదాలను ఇకపై నమ్మం అని స్పష్టం చేశారు. మరోసారి ప్రజాస్వామ్యం జోలికివస్తే ఓటుతో సరైన బుద్ధి చెప్పాల్సి వస్తుందనే హెచ్చరిక చేశారు. మోదీ ఇష్టానుసారం వ్యవహరిస్తే నిలువరించడానికి బలమైన అధికార పక్షానికి దాదాపు సమానంగా సీట్లు

కట్టబెట్టి బలమైన ప్రతిపక్షం ఉండేలా తీర్పునిచ్చారు. వెరసి ఈ ఎన్నికల్లో మోదీ ఓడి గెలిచారు. ప్రతిపక్షం గెలిచి ఓడింది.

ఇక రాష్ట్రంలోని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్ల జనంలో అంచలంచెలుగా గూడుకట్టుకున్న వ్యతిరేకత ఓట్ల రూపంలో వ్యక్తం అయింది. తెలిసి తెలిసి చేసిన అనేక స్వయం కృతాపరాధాలే ఆయన్ను కోలుకోలేని దెబ్బకొట్టాయి. ప్రజల ఆకాంక్షలు ఎలా ఉన్నాయనేది గమనించకుండా ప్రజలంతా తన కోరికలకు అనుగుణంగా మెలగాలి అనే తరహాలో జగన్ సాగించిన పాలన పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు విసుగు చెందారు. ప్రభుత్వ ఆస్తిని కూల్చడమే మొదటి పనిగా పాలన ప్రారంభించిన జగన్ అభివృద్ధి జాడ కనిపించకుండానే ఐదేళ్లు పాలన చేశారు. రాష్ట్రానికి లభిస్తున్న అదాయానికి అదనంగా పదిలక్షల కోట్లకు పైగా అప్పులుతెచ్చి అందులో సంక్షేమం అంటూ పదోవంతు పంపిణీ చేయడం ద్వారా ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాలనుకున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రతిపక్షాలు ఎన్నిసార్లు చెప్పినా చెవికెక్కలేదు. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అనే రీతిలో అన్ని వ్యవస్థలని ఇష్ట ప్రకారం నడిపారు. కక్షపూరిత రాజకీయాలకు తెరలేపారు.

రాష్ట్ర విభజన నాటి ఆంధ్రప్రదేశ్ అనేక సమస్యలతో సతమతమవుతున్నది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందాన గడచిన ఐదు సంవత్సరాలు రాష్ట్రం అన్ని రంగాల్లో వెనక్కు వెళ్లింది. విభజననాటి చట్టంలోని ఏ ఒక్క అంశము పూర్తి కాలేదు. జగన్ అహంభావ, అనాలోచిత నిర్ణయం కారణంగా రాజధాని ఏదో అర్థం కాని అయోమయం ఏర్పడింది. మూడు రాజధానులు నిర్ణయానికి అడ్డం పడుతున్నారు అనే అక్కసుతో ఏకంగా శాసన మండలిని రద్దు చేయాలని పార్లమెంటు తలుపు తట్టారు. ఏపీకి జీవనాడిగా భావించే పోలవరం నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అనే చందాన తయారైంది. ఉపాధి కల్పనారంగం అంపశయ్యపైకి చేరింది. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రైతుల్లో భయాన్ని కలుగచేసింది. మద్యం అధిక ధరలకి ఎరులైపారింది. రాష్ట్ర భవిషత్తు ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టేలా చేసింది. యువత ఉపాధి అవకాశాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసినా ప్రభుత్వం వెక్కిరించింది. వలంటీర్ ఉద్యోగమే గొప్ప అన్నట్టు వ్యవహారం నడిపింది. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండరు ఇచ్చి తీరతామని ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీని ఆయన మరచినా నిరుద్యోగ యువత మరువలేదు. వెరసి ఎన్నికల రణరంగంలో పాలకుడికి అహంకారం ఆభరణం కాకూడదనే గుణపాఠం చెప్పి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. రాష్ట్ర అభివృద్ధి ముఖ్యం అనేది తాజా ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు సారాంశం.

ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు దేశ రాజకీయాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ఏపీ పాలకుల మద్దతులేకుండా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మనుగడ సాధించలేని స్థితినెలకొంది. ఇది రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన గొప్ప అవకాశం. ఈ మంచి అవకాశాన్ని ఏపీలో కొత్తగా కొలువైన చంద్రబాబు ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలి. గత పదేళ్లుగా ఏపీకి జరిగిన అన్ని అన్యాయాలను సరిదిద్దాలి. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం అన్న కేంద్ర ప్రభుత్వం చేత ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆకాంక్ష ముగిసిన అధ్యాయం కాదని గుర్తించేలా చేయించే అవకాశం కూడా ఉన్నది. విభజన చట్టంలోని అన్ని హామీలను పరిపూర్తి చేయించడం ద్వారా ప్రజలు ఇచ్చిన తీర్పు వెనుక ఉన్న ఆశలని, ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉన్నది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఉపాధి అవకాశాల కల్పన ప్రభుత్వ దినచర్యలో భాగం కావాలి. అభివృద్ధిని, సంక్షేమాన్ని రెండు కళ్లుగా మార్చుకొని ముందుకి నడవాలని ఆశిద్దాం.

సెల్: 90598 37847

అసెంబ్లీల పోరుకు బీజేపీ వ్యూహం

- ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల్లో కాషాయ పార్టీకి ఎదురుదెబ్బ
- మహారాష్ట్రకు ఇన్‌ఛార్జ్‌లుగా ఇద్దరు మంత్రులు
- హర్యానా, జార్ఖండ్, జమ్మూకశ్మీర్‌కు కూడా...

న్యూదిల్లీ: కాషాయ పార్టీ బీజేపీ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతోంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసి రెండు వారాలు కాకముందే ఆయా రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు వ్యూహ రచన చేస్తోంది. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేశారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఎదురుదెబ్బ చవి చూసింది. దీంతో ఈసారి గట్టి వ్యూహరచనతో సిద్ధమవుతోంది. ఈ ఏడాది చివరిలో మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, జమ్మూకశ్మీర్‌లకు జరిగే అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ఇప్పటికే తన ఇన్‌ఛార్జ్‌ల పేర్లను ప్రకటించడం ప్రారంభించింది. చాలా ముఖ్యమైన మహారాష్ట్రకు ఇన్‌ఛార్జ్‌లుగా కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఇన్‌ఛార్జ్‌గా నియమించగా, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సహ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. మరో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు హర్యానా బాధ్యతలు అప్పగించారు. ఆయనకు త్రిపుర మాజీ ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్ సహాయంగా ఉన్నారు. ఇక జార్ఖండ్‌లో మధ్య ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కొత్త నియమితులైన శివరాజ్ సింగ్ చౌహాన్ ఇన్‌ఛార్జ్‌గా, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వాస్ శర్మ సహ ఇన్‌ఛార్జ్‌గా ఉంటారు. అలాగే, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని ఇన్‌ఛార్జ్‌గా నియమించింది.

మహారాష్ట్ర పైనే ప్రధాన దృష్టి

రాబోయే అన్ని అసెంబ్లీ ఎన్నికలలో మహారాష్ట్ర దేశ ఆర్థిక రాజధానికి నిలయంగా లేదా లోక్‌సభ స్థానాల పరంగా రెండవ అతిపెద్ద రాష్ట్రంగా ఉండటం వల్ల ప్రధా నంగా దృష్టి కేంద్రీకరించింది. కానీ బీజేపీ పూర్తిగా కొత్త కూటమితో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తోంది. ఇది ఇప్పుడు శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ, ఏకనాథ్ షిండే వర్గంతో పొత్తు పెట్టుకుని కాంగ్రెస్-శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే), ఎన్‌సీపీ (శరద్చం ద్ర పవార్) కూటమిని ఎదుర్కొంటోంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 48 స్థానాలకు గాను 23 స్థానాల్లో బీజేపీ విజయం సాధించగా, అవిభక్త శివసేనతో పొత్తు పెట్టుకుని 41 స్థానాలు గెలుచుకుంది. కానీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో దాని కొత్త కూటమి... బీజేపీ తొమ్మిది స్థానాలతో కలిపి కేవలం 17 స్థానాల్లోనే విజయం సాధిం చింది. కాంగ్రెస్ ఒక స్థానం నుంచి 13 స్థానాలకు బలం పెంచుకోవడం ద్వారా రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవత రించింది. దాని మిత్రపక్షాలతో 30 గెలుచుకుంది. భూపేంద్ర యాదవ్, అశ్విని వైష్ణవ్ గత సంవత్సరం మధ్య ప్రదేశ్‌కు ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. అక్కడ 230 సీట్లలో 163 గెలుచుకుని బీజేపీ ఘన విజయాన్ని సాధించింది. ఎన్నికలకు ముందు భూపేంద్ర యాదవ్, వైష్ణవ్ పరిస్థితిని మలుపు తిప్పడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. మరొక రాష్ట్రం హర్యానాలో ఈసారి పోరాడవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలలో దాని సంఖ్య సగానికి తగ్గిపోయింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ స్థానంలో నయాబ్ సింగ్ సైనీని నియమించింది. వరుసగా మూడవసారి రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ప్రధాన్, దేవ్‌ను నియమించి పార్టీ కసరత్తు చేస్తోంది. ఇక జార్ఖండ్‌లో కూడా మధ్య ప్రదేశ్ ప్రయోగం చేద్దామని చూస్తుంది. హేమంత బిశ్వాస్ శర్మతో ఎన్నికల్లో గట్టెక్కే ప్రయత్నాలు మొదలు పెట్టింది. జార్ఖండ్ ముక్తి మోర్చా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు శర్మ నైపుణ్యాలు ఉపయోగపడతాయని కాషాయ పార్టీ భావిస్తోంది. జమ్మూకశ్మీర్‌లో 2014 తర్వాత మొదటి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూలోని రెండు లోక్‌సభ స్థానాలకూ బీజేపీ పోటీ చేయలేదు.

ఈవీఎంలతోనే బీజేపీ గెలుపు: ఆదిత్య ఠాక్రే

ముంబై: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించిన సీట్లపై శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే కీలక వ్యాఖ్యలు చేశారు. ఈవీఎంలు లేకుంటే బీజేపీకి కనీసం 40 సీట్లు కూడా వచ్చేవి కాదని అన్నారు. అమోల్ కృతికార్ స్థానంలో తాము విజయం సాధించామని, దీనిపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. ఈసీ అంటే ఎన్నికల కమిషన్ కాదని, ఈజీలీ కాంప్రమైజ్డ్ అని సరికొత్త భాష్యం చెప్పారు. కాషాయ పార్టీ ఈవీఎంలను అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో విజయం సాధించిందని అన్నారు. ఇక ముంబై ఈవీఎం వివాదం దుమారం రేపుతోంది. ఈ ఉదంతంపై శివసేన నేత సంజయ్ నిరుపమ్ స్పందిస్తూ శివసేన (యూబీటీ) వాయువ్య ముంబై సీటును కేవలం 48 ఓట్లతో కోల్పోయిందని, ఈ విషయాన్ని ఈవీఎంలపై ఆరోపణలు గుప్పించేవారు అంగీకరించాలని అన్నారు. సంజయ్ రౌత్ ప్రతిరోజూ అసత్యాలు ప్రచారం చేస్తారని, ఆయన వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు తనను ప్రశ్నించడం సరైంది కాదని చెప్పారు. వాయువ్య ముంబైలో ఈవీఎంలు హ్యాక్ అయితే... దక్షిణ మధ్య ముంబైలోనూ, ఈశాన్య ముంబైలోనూ హ్యాక్ అవుతాయని అన్నారు. ముందుగా వారి పార్టీ నుంచి గెలుపొందిన ఇద్దరు, ముగ్గురు ఎంపీలు రాజీనామా చేయాలని, అప్పుడు ఈవీఎంల గురించి మాట్లాడాలని అన్నారు. ఈవీఎంలపై అసత్యాలు చెబుతున్న సంజయ్ రౌత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ చేశారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై వ్యాఖ్యలు చేసిన ఆదిత్య ఠాక్రే కూడా క్షమాపణ చెప్పాలని ఆయన పేర్కొన్నారు.

అజిత్ దోబల్‌తో అమెరికా జాతీయ భద్రతా సలహాదారు భేటీ

న్యూదిల్లీ: జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబల్‌తో (ఎన్‌ఎస్‌ఏ) అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలివన్ సోమవారం దిల్లీలో సమావేశమయ్యారు. పరస్పర ప్రయోజనాలతో ముడిపడిన ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం గురించి ఇద్దరు చర్చించారు. రెండు దేశాలకు చెందిన వివిధ విభాగాల ప్రతినిధి బృందాలతోనూ వారిద్దరూ చర్చించారు. ఇక సీఐఐ అధ్వర్యంలో మంగళవారం జరిగే ఇండియా-యూఎస్ ఐసీఈటీ రౌండ్‌టేబుల్ సమావేశంలోనూ వారు పాల్గొంటారు. ఈ సమావేశానికి పరిశ్రమ ప్రముఖులు, వ్యాపార దిగ్గజాలు, సీఈవోలు హాజరు కానున్నారు.

మోదీ హయాంలో పెట్రో ధరల పెంపు: సిద్ధరామయ్య

బెంగళూరు: రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని బీజేపీ, జేడీఎస్ గగ్గోలు పెడుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు నిరసన చేపట్టారని కర్నాటక సీఎం సిద్ధరామయ్య ఎదురుదాడికి దిగారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టడం తగదని, పెట్రో భారాలు మోపిన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించాలని హితవు పలికారు. నరేంద్ర మోదీ ప్రధాని కాగానే పెట్రోల్ ధరలను లీటర్‌కు రూ.72 నుంచి రూ.104కు పెంచారని, డీజిల్ ధరలను రూ.58 నుంచి రూ.92కు పెంచారని గుర్తుచేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినప్పుడు కూడా మోదీ ప్రభుత్వం పెట్రో ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపిందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్రంలో వ్యాట్‌ను పెంచినప్పటికీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కర్నాటకలో పెట్రోల్, డీజిల్ ధరలు అందుబాటులోనే ఉన్నాయన్నారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలతో పోలిస్తే కర్నాటకలో పెట్రో ఉత్పత్తుల ధరలు ఇప్పటికీ తక్కువగానే ఉన్నాయని సీఎం సిద్ధరామయ్య చెప్పారు.

పెట్రో ధరలపై బీజేపీ నేతల నిరసన

బెంగళూరు: కర్నాటకలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపునకు వ్యతిరేకంగా ప్రతిపక్ష బీజేపీ నిరసనకు దిగింది. కర్నాటక రాజధాని బెంగళూరులో ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ అధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అశోక్‌తోపాటు ముఖ్య నేతలు కార్లకు బదులుగా ఎడ్లబండిపై ఫ్రీడం పార్క్ ఏరియాకు వచ్చారు. అప్పటికే భారీ ఎత్తున బీజేపీ కార్యకర్తలు అక్కడ గుమిగూడారు. ఈ సందర్భంగా కర్నాటక సర్కారు వ్యతిరేక నినాదాలతో ఫ్రీడమ్ పార్క్ ఏరియా మార్మోగింది. కర్నాటక ప్రభుత్వం రెండు రోజుల క్రితం పెట్రోల్, డీజిల్ సేల్స్ ట్యాక్స్ పెంచింది. దాంతో పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.3 చొప్పున ధర పెరిగింది. ఈ క్రమంలో కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపిందని బీజేపీ ఆందోళనకు దిగింది.

మరో కొత్త రకం స్కామ్

రూ.81 లక్షలకు టోకరా

పూణె: అమాయకుల నుంచి డబ్బులు కొట్టేసేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త మార్గాలు అనుసరిస్తున్నారు. ఒకతరహా స్కామ్ గురించి ప్రజల్లో అవగాహన రాగానే... మరో కొత్త మార్గం అన్వేషిస్తున్నారు. తాజాగా అడ్వర్టైజ్‌మెంట్ మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. పూణెకు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి నుంచి సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.81 లక్షలు కాజేశారు. కెమికల్ ఇంజినీర్‌గా పనిచేసి రిటైర్ అయిన ఓ వ్యక్తికి మే నెల మూడో వారంలో గుర్తుతెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. 'మీ పేరుతో చట్ట విరుద్ధంగా అభ్యంతరకరమైన ప్రకటన వచ్చింది. దీనిపై ఇప్పటికే 24 ఫిర్యాదులు వచ్చాయి. మీ మీద ముంబైలోని ఫోర్ట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది' అని అవతలి వ్యక్తి చెప్పాడు. బాధితుడిని మరింత నమ్మించేందుకు కాసేపటికే ఇన్‌స్పెక్టర్ పేరుతో మరో వ్యక్తి కాల్ చేశాడు. మనీలాండరింగ్ కార్యకలాపాలకు సంబంధించిన ఆరోపణలు కూడా ఉన్నాయని భయపెట్టాడు. ఈ వ్యవహారంలో ముంబై సీబీఐ అధిపతితో మాట్లాడి సమస్య పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చాడు. మరికాసేపటికి ఓ వీడియో కాల్. ప్రొఫైల్ పిక్‌గా పోలీస్ లోగో. అప్పటికే తీవ్ర భయాందోళనలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగికి సీబీఐ అధికారి అంటూ ఓ వ్యక్తి దర్శనమిచ్చాడు. అనైతిక, మనీలాండరింగ్ ఆరోపణలతో ఆస్తులను ఫ్రీజ్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయని మరింత ఆందోళనకు గురిచేశాడు. కోర్టు పేరు చెప్పడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. తాను ఏ తప్పు చేయలేదని చెప్పినా... అవతలి వ్యక్తి దబాయించడం మొదలుపెట్టాడు. బాధితుడు ఏం చెప్పినా వింటాడనే దశకు వచ్చాక... సీబీఐ అధికారి ముసుగులో ఉన్న సైబర్ నేరగాడు వ్యక్తిగత వివరాలు ఆరా తీయడం మొదలుపెట్టాడు. బ్యాంకు బ్యాలెన్స్ వివరాలు తెలుసుకున్నాడు. తర్వాత రూ.60 లక్షలు, రూ.21 లక్షలు చొప్పున రెండుసార్లు సెక్యూరిటీ డిపాజిట్ పేరిట వసూలు చేశాడు. ఇంకా డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితుడికి అనుమానం వచ్చి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 'పార్శిల్స్' స్కామ్ తరహాలోనే ఈ వృద్ధుడి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. అతడిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ తరహా ఫేక్ కాల్స్‌కు స్పందించొద్దని ప్రజలకు పోలీసులు సూచించారు.

లోపాలున్న ఈవీఎంల వివరాలు ఇవ్వండి

ఈసీని కోరిన గౌరవ్ గొగోయ్

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) లోపాలు కలిగి ఉన్నాయనే వివరాలను వెల్లడించాలని కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ సోమవారం ఎన్నికల సంఘం (ఈసీ) ని కోరారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో అసోంలోని జోర్హాట్ స్థానం నుంచి తన సమీప బీజేపీ ప్రత్యర్థిని 1.44 లక్షల ఓట్ల తేడాతో ఓడించి గెలుపొందిన గొగోయ్, ఈ యంత్రాలు సరికాని ఫలితాలను చూపించాయని తాను నమ్మకంగా చెప్పగలనని అన్నారు. ముంబై వాయువ్య లోక్‌సభ నియోజకవర్గంలోని శివసేన అభ్యర్థి బంధువు జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌కు 'అనుసంధానం' చేసిన మొబైల్ ఫోన్‌ను ఉపయోగిస్తున్నారని ఆరోపించిన మీడియా కథనాన్ని ఉటంకిస్తూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకులతో ఈవీఎం ట్యాంపరింగ్ ఆరోపణలపై తాజా రాజకీయ వివాదం చెలరేగిన ఒక రోజు తర్వాత గొగోయ్ ఈ ప్రకటన చేశారు. 'ఎక్స్'పై ఒక పోస్ట్‌లో గొగోయ్... ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌లను (ఈవీఎంలు) తప్పుపట్టలేనివిగా పరిగణించే ముందు, ఎన్నికల మొత్తంలో ఎన్ని ఈవీఎంలు లోపాలు కలిగి ఉన్నాయనే వివరాలను భారత ఎన్నికల సంఘం వెల్లడించాలని అన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్ని యంత్రాలు తప్పుడు సమయం, తేదీ, ఓట్లు నమోదు చేసిందో, ఎన్ని ఈవీఎంలు వాటి కాంపోనెంట్‌లను... కౌంటింగ్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ మార్చాయి. ఎన్ని ఈవీఎంలు మాక్ పోల్‌లో తప్పుగా గుర్తించాయో ఈసీ సమాధానం చెప్పాలని కోరారు. 'ఎన్నికలలో పోటీ చేసినందున, ఈ యంత్రాలు సరికాని ఫలితాలను చూపించాయని నేను నమ్మకంగా చెప్పగలను. ఎన్నికల కమిషన్ పై డేటాను బయటపెడుతుందని నేను ఆశిస్తున్నాను ఎందుకంటే ప్రజలకు తెలుసుకునే హక్కు ఉంది' అని ఆయన అన్నారు. అయితే, ముంబై వాయువ్య లోక్‌సభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వందనా సూర్యవంశీ మిడ్-డే వార్తాపత్రికలో వచ్చిన నివేదికను 'తప్పుడు వార్త' అని కొట్టిపారేశారు. ప్రచురణ సంస్థపై పరువు నష్టం నోటీసు జారీ చేసినట్లు చెప్పారు. ఈవీఎం అనేది ఒక స్వతంత్ర వ్యవస్థ అని, ప్రోగ్రామబుల్ కాదని, వైర్‌లెస్ కమ్యూనికేషన్ సామర్థ్యాలు లేవని ఆమె నొక్కి చెప్పారు.

ఎన్ఐఏకి రియాసి ఉగ్రదాడి కేసు

హోంశాఖ కీలక నిర్ణయం

న్యూదిల్లీ: రియాసి ఉగ్రదాడి కేసు విషయంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ దాడి కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించింది. ఈ ఉగ్ర దాడిపై చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన కేసు ఇప్పటికే ఎన్ఐఏ నమోదు చేసింది. ఈ ఉగ్ర దాడి వెనుక పెద్ద కుట్ర ఉందని ఎన్ఐఏ భావిస్తున్న క్రమంలో ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేయనుంది. మరోవైపు ఈ దాడితో సంబంధముందని భావిస్తున్న 50 మంది అనుమానితులను భద్రతా దళాలతోపాటు పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసి... ప్రశ్నిస్తున్నారు. ఇక ఈ దాడిలో కీలకంగా వ్యవహరించిన ముగ్గురు ఉగ్రవాదులకు సంబంధించిన ఊహా చిత్రాలను పోలీసులు విడుదల చేశారు. నిందితులకు సంబంధించిన సమాచారం అందిస్తే రూ. 20 లక్షల రివార్డ్ అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి విదితమే. ఈ నెల 9వ తేదీన జమ్మూకాశ్మీర్ రియాసీలోని శివ ఖోరి నుంచి కాత్రాలో మాతా వైష్ణోదేవి ఆలయానికి భక్తులతో వెళ్తున్న బస్సుపై ఉగ్రవాదులు ఆకస్మాత్తుగా కాల్పులు జరిపారు. దీంతో డ్రైవర్ వేగాన్ని పెంచడంతో బస్సు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు సహా 9 మంది మరణించారు. మరో 41 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జరిగిన సమయంలోనే న్యూఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేశారు. ఇక ఈ దాడిపై సమాచారం అందుకున్న ప్రధాని మోదీ... వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్ర ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల జమ్మూకాశ్మీర్‌లో వరుసగా ఉగ్రవాద దాడులు జరుగుతున్న క్రమంలో ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన ఆదివారం న్యూఢిల్లీలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఉగ్రవాద దాడులను అణిచివేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధి కారులకు అమిత్ షా సూచించారు. అలాగే జూన్ 29వ తేదీ నుంచి అమర్నాథ్ యాత్ర ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అంతర్జా తీయ సరిహద్దులతోపాటు నియంత్రణ రేఖ వద్ద భారీగా భద్రత దళాలను మోహరించాలని ఉన్నతాధికారులను అమిత్ షా ఆదేశించారు.

'భారత్'... 'ఇండియా'పై చర్చ ఎందుకు?

- పాఠ్యపుస్తకాలలో పర్యాయపదాలుగా వాడుకోవచ్చు
- ఎన్‌సీఈఆర్‌టీ అధ్యక్షుడు దినేశ్ ప్రసాద్

న్యూదిల్లీ: దేశ రాజ్యాంగంలో ఉన్నట్లు ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలలో 'భారత్'... 'ఇండియా' అనే పదాలను పర్యాయపదాలుగా ఉపయోగించు కోవచ్చని జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లాని తెలిపారు. సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలపై పనిచేస్తున్న ఉన్నత స్థాయి ప్యానెల్ అన్ని తరగతుల పాఠశాల పాఠ్యపుస్తకాల్లో ఇండియా స్థానంలో 'భారత్' అని సిఫార్సు చేసిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఇక్కడ వార్తా సంస్థ ప్రధాన కార్యాలయంలో పీటీఐ ఎడిటర్‌లతో జరిగిన సంభాషణలో ఎన్‌సీఈఆర్‌టీ చీఫ్.... ఈ రెండు పదాలను పుస్తకాలలో ఉపయోగిస్తారని, మండలికి ఇండియా లేదా 'భారత్' పట్ల విరక్తి లేదని స్పష్టం చేశారు. 'ఇది పర్యాయపదాలుగా వాడుకోగలిగినది... మన స్థానం మన రాజ్యాంగం చెప్పింది. మేము దానిని సమర్థిస్తాం. మనం 'ఇండియా'ను ఉపయోగించ వచ్చు, మనం 'భారత్' ను ఉపయోగించవచ్చు, సమస్య ఏమిటి? మేము ఆ చర్చలో లేము. అది సరిపోయే చోట మేము 'భారత్'ను, అలాగే అది సరిపోయే చోట ఇండియాను ఉపయోగిస్తాం' అని ఆయన అన్నారు. 'ఇప్పటికే మా పాఠ్యపుస్తకాల్లో రెండింటినీ ఉపయోగించడాన్ని మీరు చూడవచ్చు. కొత్త పాఠ్యపుస్తకాలలో ఇది కొనసాగుతుంది. ఇది పనికిరాని చర్చ' అని సక్లాని అన్నారు. పాఠశాల పాఠ్యాంశాలను సవరించడానికి ఎన్‌సీఈఆర్‌టీ ఏర్పాటు చేసిన సామాజిక శాస్త్రాల కోసం ఉన్నత స్థాయి కమిటీ, అన్ని తరగతుల పాఠ్యపుస్తకాల్లో ఇండియా స్థానంలో 'భారత్' అని గత సంవత్సరం సిఫార్సు చేసింది. ప్యానెల్‌కు నేతృత్వం వహిస్తున్న కమిటీ చైర్‌పర్సన్ సి.ఐ.ఐజాక్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలలో ఇండియా పేరును 'భారత్' తో భర్తీ చేయాలని, అన్ని సబ్జెక్టుల కోసం సిలబస్‌లో భారతీయ నాలెడ్జ్ సిస్టమ్ (ఐకేఎస్) తో సహా పాఠ్యాంశాల్లో 'ప్రాచీన చరిత్ర'కు బదులుగా 'క్లాసికల్ హిస్టరీ'ని ప్రవేశపెట్టాలని సూచించామని చెప్పారు. 'తరగతుల వారీగా పాఠ్యపుస్తకాల్లో 'భారత్' అనే పేరును ఉపయోగించాలని కమిటీ ఏకగ్రీవంగా సిఫార్సు చేసింది. 'భారత్' అనేది పురాతనమైన పేరు. 7 వేల సంవత్సరాల పురాతనమైన విష్ణు పురాణం వంటి గ్రంథాలలో 'భారత్' పేరు ఉపయోగించారు' అని పీటీఐకి ఐజాక్ చెప్పారు. అయితే, ప్యానెల్ సిఫారసులపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఎన్‌సీఈఆర్‌టీ అప్పుడు తెలిపింది. గత ఏడాది ప్రభుత్వం జీ20 ఆహ్వానాలను 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా' కు బదులుగా 'భారత రాష్ట్రపతి' పేరుతో పంపినప్పుడు భారత్ అనే పేరు అధికారికంగా కనిపించింది. ఆ తర్వాత న్యూదిల్లీలో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ నేమ్‌ప్లేట్‌లో ఇండియాకు బదులుగా 'భారత్' అని కూడా రాశారు.

విద్యుత్ అంతరాయంతో ఎయిర్‌పోర్టులో నిలిచిన బోర్డింగ్, చెక్‌ఇన్‌లు

న్యూదిల్లీ: దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం సుమారు 20 నిమిషాల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పలు ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన బోర్డింగ్, చెక్‌ఇన్ సౌకర్యంపై ప్రభావం పడింది. టెర్మినల్ 2పై ఉన్న పలు విమానాల సర్వీసుల్లో జాప్యం తలెత్తింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వందలాది ప్రయాణికులు క్యూలలో నిలిచిపోయారు. ఏం జరుగుతోందో తెలియక ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చెక్ ఇన్ ప్రొసీజర్, సెక్యూరిటీ చెకప్‌లకు కీలకమైన ఎలక్ట్రానిక్ సిస్టమ్‌లు మొరాయించాయి. బోర్డింగ్ పాస్‌లు, బ్యాగేజ్ హ్యాండ్లింగ్ వంటి సమస్యలు తలెత్తినట్టు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితిని చక్కదిద్ది, ప్రయాణికులకు సహకరించేందుకు అదనపు సిబ్బందిని విమానాశ్రయ అధికారులు వెంటనే రంగంలోకి దింపారు. టెర్మినల్ 3లో 15 నిమిషాల పాటు లైటు కూడా లేదని, నీళ్లు, కాఫీ, తినుబండారాలు కూడా కొనుగోలు చేయలేకపోయామని, ఎవరైనా పట్టించుకునే వారున్నారా... అంటూ ఓ ప్రయాణికుడు సామాజిక మాధ్యమ్యం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. కాగా, విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి కారణాలు వెంటనే తెలియలేదు.

రాజ్‌భవన్ నుంచి వెళ్లిపోండి

పోలీసులకు బెంగాల్ గవర్నర్ ఆదేశం

కోల్‌కతా: రాజ్‌భవన్ వద్ద ఉన్న కోల్‌కతా పోలీసు సిబ్బంది పని తీరుపై పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే కార్యాల యం విడిచి వెళ్లిపోవాలని వారిని ఆదేశించారు. బాధితులతో కలిసి తనను కలిసేందుకు వచ్చిన సువేందు అధికారిని పోలీసులు అడ్డుకోవడమే అందుకు కారణమని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నికల అనంతరం జరిగిన హింస బాధితులతో కలిసి రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికారి ఇటీవల గవర్నర్ బోస్‌ను కలిసేందుకు వెళ్లారు. అయితే... ఆయనను అక్కడున్న పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. రాజ్‌భవన్ వెలుపల 144 సెక్షను అమలులో ఉన్నందున గుంపుగా రావడాన్ని అనుమతించమని తేల్చి చెప్పారు. గవర్నర్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంటు కూడా తీసుకున్నానని, బాధితులకు న్యాయం చేయాలని కోరేందుకే వచ్చామని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. గంటసేపు ఎదురుచూసినా లోనికి అనుమతించలేదు. ఈ వ్యవహారం తన దృష్టికి రావడంతో పోలీసుల తీరుపై గవర్నర్ మండిపడ్డారు. తన ఆదేశాలను పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు ఇక్కడ ఉంటే తాను సురక్షితంగా ఉన్నానన్న భావన కలగడం లేదన్నారని సమాచారం. దీంతో తక్షణమే పోలీసు సిబ్బంది సహా ఇన్‌ఛార్జి అధికారిని రాజ్‌భవన్ ప్రాంగణాన్ని విడిచి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. రాజ్‌భవన్ ఉత్తర ద్వార సమీపంలో ఉన్న ఔట్‌పోస్టును 'జన్ మంచ్' (ప్రజావేదిక)గా మార్చేందుకు ఆనంద్ బోస్ యోచిస్తున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

ధంగర్లకు కోటాపై దృష్టి సారించాలి: జరంగే



ఛత్రపతి సంభాజీనగర్: ఓబీసీ నాయకులు మరాఠా కోటా డిమాండ్‌ను విమర్శించడానికి బదులుగా ధంగర్ సామాజికవర్గానికి ఎస్టీ కేటగిరీ కింద రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్యమించాలని మరాఠా రిజర్వేషన్ ఉద్యమకారుడు మనోజ్ జరంగే పాటిల్ పేర్కొన్నారు. తాను చికిత్స పొందుతున్న ఛత్రపతి సంభాజీనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... 'ఓబీసీ నాయకులు మా శత్రువులు కాదు. మరాఠాలు షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) కేటగిరీ కింద ధంగర్ల(గొర్రెల కాపరి)కు రిజర్వేషన్ల డిమాండ్‌కు మద్దతు ఇస్తారు' అని జరంగే అన్నారు. మహారాష్ట్రలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాము పోటీ చేయాలని యోచిస్తున్నామని కొందరు ఓబీసీ నేతలు చేసిన ప్రకటనలపై స్పందిస్తూ... ఇది ప్రజాస్వామ్యమని, ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయవచ్చని జరంగే అన్నారు. ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడిపోతారో అని చర్చించుకునే బదులు తమ ధంగర్ వర్గానికి చెందిన పిల్లలను ఎలా చదివించుకుంటారనే విషయంపై దృష్టి పెట్టాలని సూచించారు. నేడు పశువులను మేపుకుని పొలాల్లో పనిచేయాల్సిన దుస్థితి వారికి ఏర్పడిందని అన్నారు. రాజకీయాల్లోకి వస్తే ప్రతి సంఘం నుంచి 10-20 మంది మాత్రమే ముందుకు వెళతారని, అంతకంటే ముందు మన పిల్లలు ఎలా చదువుకుంటారో ఆలోచించాలన్నారు. మహారాష్ట్రలో మరాఠా కోటాను ప్రారంభించిన ఆరు రోజుల తర్వాత... జూన్ 13న జరంగే తన నిరవధిక నిరాహార దీక్షను విరమించారు. సంఘం డిమాండ్లను అమలు చేయడానికి మహారాష్ట్ర ప్రభుత్వానికి ఒక నెల గడువు విధించారు. మహారాష్ట్ర మంత్రి, మరాఠా కోటా సబ్‌కమిటీ సభ్యుడు శంభురాజ్ దేశాయ్, శివసేన ఎంపీ సందీపన్ భూమారే తన స్వస్థలమైన జాల్నా జిల్లాలోని అంతర్వాలి సారతి గ్రామంలో ఆయనను కలిసి చర్చించిన తర్వాత జరంగేఈ ప్రకటన చేశారు. ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన కొందరు నాయకులు ఓబీసీ కేటగిరీ కింద మరాఠా కోటాను వ్యతిరేకించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో, ప్రత్యేక కేటగిరీ కింద విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో మరాఠాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును మహారాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కుంబీలను మరాఠా సంఘం సభ్యుల "సేజ్ సోయారే" (రక్త బంధువులు)గా గుర్తిస్తూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను అమలు చేయాలని, కుంబీలను మరాఠాలుగా గుర్తించే చట్టాన్ని అమలు చేయాలని జరంగే డిమాండ్ చేస్తున్నారు. మరాఠాలందరికీ కుంబీ సర్టిఫికెట్లు జారీ చేయాలని, తద్వారా కోటా ప్రయోజనాలకు వారిని అర్హులుగా మార్చాలని జరంగే కోరుతున్నారు. కుంబీ అనే అగ్రకుల సమూహం ఓబీసీ కేటగిరీ కిందకు వస్తుంది.

ఈవీఎంలపై చర్చకు ఇదే సరైన సమయం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల్లో వినియోగిస్తున్న ఈవీఎంలపై చర్చించాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోని 122 దేశాలు ఈవీఎంల విధానాన్ని అనుసరించడం లేదని, అందులోనూ పేరొందిన దేశాలూ ఉన్నాయని ఆయన చెప్పారు. ఈ మేరకు సోమవారం నారాయణ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. అమెరికా, జపాన్‌లాంటి ప్రముఖ దేశాలు ఈవీఎంలను నిషేధించి... పోస్టల్ బ్యాలెట్ వినియోగిస్తున్నాయని వివరించారు. ప్రపంచంలోని చాలా దేశాలు ఈవీఎంలతో ఎన్నికల నిర్వహణ, ఫలితాలపై అనుమానం వ్యక్తం చేస్తున్నాయన్నారు. అలాంటి సమయంలో భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశంలో ఈవీఎంలను ఎందుకు నిషేధించడం లేదని నారాయణ సూటిగా ప్రశ్నించారు. అతిపెద్ద ప్రజాస్వామ్య భారతదేశంలో ఈవీఎంలతో ఎన్నికలు నిర్వహించకుండా కేంద్ర ప్రభుత్వం చూడాలని సూచించారు. 2029 ఎన్నికల సమయానికి ఈవీఎంలు లేకుండా చర్యలు తీసుకోవాలని, దీనిపై కేంద్ర ప్రభుత్వం చర్చించి ఈవీఎంల విధానాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎన్నికల్లో ప్రజాస్వామ్య తీర్పును ఈవీఎంలు పక్కదారి పట్టించే ప్రమాదముందని నారాయణ హెచ్చరించారు.

పారదర్శకత లేకుంటే

ఈవీఎంలు రద్దు చేయండి

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషి(ఈవీఎం)న్ల పనితీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోమారు సందేహాలు లేవనెత్తారు. ఈవీఎంలను పూర్తిస్థాయిలో పారదర్శకంగా పనిచేసేలా చూడాలని... లేదంటే వాటిని ఎన్నికల ప్రక్రియలో పూర్తిగా రద్దు చేయాలని రాహుల్ ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం 'ఎక్స్'లో రాశారు. 'ప్రజాస్వామ్య సంస్థలు ఆక్రమణకు గురవుతున్నప్పుడు ప్రజలకు పారదర్శకంగా ఉండే ఎన్నికల ప్రక్రియల్లోనే రక్షణ ఉంటుంది. ఈవీఎం ప్రస్తుతం బ్లాక్ బాక్స్. ఈవీఎం యంత్రాల ప్రక్రియల పూర్తి పారదర్శకతను నిర్ధారించాలి లేదా వాటిని రద్దు చేయాలి' అని ఈసీని కోరారు. ఆదివారం కూడా రాహుల్ ఈవీఎంలపై సందేహాలు లేవనెత్తారు. ఈవీఎం బ్లాక్‌బాక్స్ అని... మన ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై తీవ్రమైన ఆందోళనలు తలెత్తుతున్నాయన్నారు. ఈవీఎంలను పరిశీలించడానికి ఎవరికీ అనుమతి లేదన్నారు. మరో కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ... 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తప్పుపట్టలేనివిగా పరిగణించే ముందు ఎన్నికల్లో మొత్తంగా ఎన్ని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు సరిగా లేవో భారత ఎన్నికల సంఘం డేటాను విడుదల చేయాలి' అని డిమాండ్ చేశారు. 'ఎన్ని యంత్రాలు తప్పుడు సమయం, తేదీ, ఓట్లు నమోదైనట్లు చూపాయి? ఎన్ని ఈవీఎంలలో వాటి భాగాల (కౌంటింగ్ యూనిట్, బ్యాలెట్ యూనిట్)ను మార్చారు? మాక్‌పోల్ సందర్భంగా ఎన్ని ఈవీఎంలు సరిగా పనిచేయడం లేదని తేలిందో వెల్లడించాలి' అని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో పోటీచేసిన వ్యక్తిగా ఈ యంత్రాలు తప్పుడు ఫలితాలను చూపించాయని నేను కచ్చితంగా చెప్పగలనన్నారు. ఎన్నికల సంఘం తాను అడిగిన డేటాను బయటపెడుతుందని ఆశిస్తున్నానని... ఎందుకంటే ప్రజలకు తెలుసుకునే హక్కు ఉందని అని గొగోయ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన కూడా 'ఎక్స్' పోస్ట్ పెట్టారు.

రాయ్‌బరేలికే రాహుల్

వయనాడ్‌లో పోటీకి ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానాన్ని వదులుకోనున్నట్లు ప్రకటించారు. ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి ఎంపీగా కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. అయితే రాహుల్‌గాంధీ రాజీనామా చేస్తున్న వయనాడ్ నుంచి ఆయన సోదరి ప్రియాంకాగాంధీ బరిలో దిగనున్నారు. ఆమె తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఆ పార్టీ అగ్ర నేతలు సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ఎంపీ రాహుల్‌గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, మరో ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవల రాహుల్ గాంధీ గెలిచిన రెండు ఎంపీ స్థానాల్లో దేనిని వదులుకోవాలనే విషయంలో నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ఆ నిర్ణయాన్ని మీడియాకు ప్రకటించారు. తాను వయనాడ్ లోక్‌సభ స్థానానికి రాజీనామా చేసి, రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు రాహుల్ గాంధీ చెప్పారు. వయనాడ్ స్థానాన్ని వదులుకున్నప్పటికీ అక్కడి ప్రజలతో తన అనుబంధం కొనసాగుతుందని చెప్పారు. రాయ్‌బరేలీ, వయనాడ్‌లలో ఏ స్థానాన్ని వదులుకోవాలనే విషయాన్ని తేల్చుకోవడానికి తాను చాలా కష్టపడాల్సి వచ్చిందని అన్నారు.

24 నుంచి అసెంబ్లీ సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. 26వ తేదీ వరకు అంటే మూడు రోజులపాటు సమావేశాలు జరగనున్నాయి. వాస్తవానికి ఈనెల 19 నుంచి నిర్వహించాలని తొలుత భావించినప్పటికీ, గవర్నర్ అబ్దుల్ నజీర్ బక్రీద్ పండుగను పురస్కరించుకుని సెలవులో ఉండటం, మంత్రులు కూడా పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించకపోవడంతో అసెంబ్లీ నిర్వహణ తేదీల్లో మార్పు చోటు చేసుకుంది. 24 నుంచి నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. 24న ప్రొటెం స్పీకర్‌ను ఎన్నుకున్న తర్వాత కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

రిషికొండ భవన నిర్మాణ ఖర్చుపై సమగ్ర విచారణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: విశాఖపట్నం రిషికొండపై రూ.450 కోట్లు వెచ్చించి రాజప్రాసాదంలా నిర్మించిన భవనాల నిర్మాణ ఖర్చుపై సమగ్ర విచారణ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశాఖపట్నంలో రిషికొండకు బోడిగుండు కొట్టించి, రూ.450 కోట్లు ప్రజాధనం వెచ్చించి రాజ ప్రాసాదంలా భవనాలు నిర్మించిందని తెలిపారు. ఆ భవనాలు జగన్ మోహన్‌రెడ్డి నివాసముండేందుకే నిర్మించినట్లు అనేక ఆరోపణలు వెల్లువెత్తాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కూడా అనేకసార్లు విశాఖకు తన నివాసాన్ని మార్చుకుంటున్నట్లు చెప్పారని గుర్తుచేశారు. విశాఖపట్నమే ఏపీ రాజధాని అని, తన ప్రమాణ స్వీకారం విశాఖలోనే జరుగుతుందని, విశాఖ నుండే పాలన సాగిస్తానని ఎన్నికల ముందు కూడా జగన్ ప్రకటించారని చెప్పారు. వైసీపీ ఓటమితో రిషికొండపై నిర్మాణాలు ప్రభుత్వానివేనంటూ కప్పదాటు వైఖరి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజలకు సెంటు స్థలంలో ఇళ్లు ఇచ్చి... రిషికొండపై రాజమహల్ నిర్మించుకున్న జగన్‌మోహన్‌రెడ్డి వైఖరిని తీవ్రంగా ఖండించారు. గతంలో రిషికొండపై ఏపీ పర్యాటక అభివృద్ధి శాఖకు సంబంధించిన కాటేజీలు ఉండేవన్నారు. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఆయా కాటేజీలను అర్థాంతరంగా పడగొట్టేశారని తెలిపారు. పర్యావరణ నియమాలు తోసిరాజని, 9.8 ఎకరాల విస్తీర్ణంలో ఏడు బ్లాక్‌లు నిర్మించారన్నారు. రూ.450 కోట్ల ప్రజాధనంతో అనుమతులు లేకుండా రిషికొండపై అక్రమంగా అత్యంత విలాసవంతమైన భవనాలు నిర్మించారని పేర్కొన్నారు. నిర్మాణకాలంలో ప్రతిపక్ష నేతలెవ్వరూ రిషికొండ ప్రాంతంలో పర్యటించకుండా పోలీసు వలయాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. గూగుల్ మ్యాప్‌లో కూడా తెలియకుండా గ్రీన్‌మ్యాట్‌తో కప్పేశారని తెలిపారు. ఆ భవనాల్లో అత్యంత ఖరీదైన బాత్‌టబ్‌లు, మంచాలు, 360 డిగ్రీల లైట్లు, ఆధునిక మోడళ్లలో ఫ్యాన్లు వంటివి ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ వినియోగానికైతే ఇంతటి విలాసవంతమైన భవంతుల నిర్మాణం ఎందుకని ప్రశ్నించారు. దాదాపు రూ.100 కోట్ల విలువగల పర్యాటకశాఖ భవనాలు కూలదోసి... రూ.450 కోట్లతో నూతన భవనాల నిర్మాణం అవసరమా అని నిలదీశారు. రిషికొండ రాజ్‌మహల్ నిర్మాణ ఖర్చుపై సమగ్ర విచారణ జరపాలని, అక్రమ నిర్మాణాల బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయా భవనాలను పర్యాటక శాఖకు అప్పగించి... ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రామకృష్ణ కోరారు.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

రాంచి: జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. సోమవారం ఉదయం సింగ్‌భూమ్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. టోంటో, గోయిల్‌కేరా ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై నిఘావర్గాల నుంచి సమాచారం అందడంతో పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసు ఉన్నతాధికారి అమోల్ వి హోమ్‌కర్ తెలిపారు. 'ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. అందులో ఒకరు మహిళ. మరో ఇద్దరు మావోయిస్టులను అరెస్ట్ చేశాం. ఘటన స్థలం నుంచి రైఫిల్స్ స్వాధీనం చేసుకున్నాం' అని వెల్లడించారు. ఇక రెండు రోజుల క్రితం చత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 8 మంది మావోయిస్టులు, ఒక స్పెషల్ టాస్క్ ఫోర్స్ జవాన్ మృతి చెందిన సంగతి విదితమే.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి

మారుమూల ప్రాంతాలకు ఫీడర్ అంబులెన్స్‌లు

ఆశ్రమ పాఠశాలల్లో 544 మంది ఏఎన్ఎంల నియామకంపై తొలి సంతకం

బాధ్యతలు స్వీకరించిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : గిరిజన ప్రాంతాల అభివృద్ధి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం మూడవ భవనంలో ఆమె మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గిరిజన మారుమూల ప్రాంతాల్లో రహదారులు సరిగా లేని, అంబులెన్సులు వెళ్లడానికి అవకాశం లేని చోట్ల ఫీడర్ అంబులెన్సులను (ద్విచక్ర వాహన) తిరిగి ప్రవేశ పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గర్భిణీలు, చిన్నారులు, గిరిజన ప్రాంతాల ప్రజలు ఎవరూ పౌష్టికాహార లోపంతో చనిపోకుండా నివారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు 544 ఏఎన్ఎంలను తక్షణమే నియమించనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించిన నియామక దస్త్రంపై మంత్రి సంధ్యారాణి తొలి సంతకం చేశారు. గతంలో సాలూరు నియోజకవర్గంలో దేశంలోనే గుర్తింపు పొందిన గిరిజన గర్భిణుల వసతి గృహం ఉండేదని, అలాంటి వసతి గృహాలను వివిధ గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐటీడీఏలు, ఐసీడీఎస్ ప్రాజెక్టులను పూర్తిగా ప్రక్షాళన చేసి గిరిజనులు, మహిళలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, పౌష్టికాహార లోప నివారణ వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ జేవీ మురళి, గురుకుల సొసైటి కార్యదర్శి సదా భార్గవి, గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్సీ శ్రీనివాస్, జీసీసీ ఎండీ సురేశ్ తదితర అధికారులు మంత్రి సంధ్యారాణికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏపీలో బలమైన శక్తిగా కాంగ్రెస్

సోనియా, రాహుల్‌తో షర్మిల భేటీ

20, 21న నియోజకవర్గాల వారీగా సమీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన శక్తిగా అవతరించడంలో మరిన్ని అడుగులు పడనున్నాయని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి అనంతరం ఢిల్లీలోని సోనియా నివాసంలో పార్టీ అగ్ర నేతలు సోనియా, రాహుల్, ప్రియాంకతో షర్మిల సోమవారం భేటీ అయ్యారు. అనంతరం రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై తీసుకునే నిర్ణయాలపై అగ్ర నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్ ప్రణాళికలు, తదుపరి కార్యాచరణపై నిర్మాణాత్మకంగా చర్చించినట్లు షర్మిల తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ తిరిగి పునర్ వైభవం సంపాదించుకుంటుందన్నారు.

రెండు రోజులపాటు పార్టీ పరిస్థితి, బలోపేతం ఆరా

ఈనెల 20, 21 తేదీల్లో రెండు రోజులపాటు విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా కాంగ్రెస్ పార్టీ సమీక్షలు నిర్వహించనుంది. ఈ మేరకు పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ అధ్యక్షురాలు షర్మిల అధ్వర్యంలో జరగనున్న సమీక్షలకు పార్లమెంటు పరిధిలో ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీ చేసి ఓటమి పాలైన వారు, పార్టీ ముఖ్య నేతలు హాజరు కానున్నారు. 20వ తేదీన ముందుగా కడప పార్లమెంటుపై ఆమె సమీక్షించనున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కడప నుంచి షర్మిల పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఉదయం 10 గంటల నుంచి 10.30 గంటల వరకు కడప పార్లమెంటరీ పరిధిలోని కాంగ్రెస్ నేతలతో ఆమె భేటీ అవుతారు. ప్రతి పార్లమెంటుకు అర్ధగంట చొప్పున సమయం కేటాయించి పార్టీ పరిస్థితి, దాని బలోపేతంపై ఆరా తీస్తారు. ఆ తర్వాత 10.30 గంటల నుంచి 11 గంటల వరకు కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని నేతలతో మాట్లాడతారు. అనంతరం నంద్యాల, అనంతపురం, హిందూపురం, నెల్లూరు, ఒంగోలు పార్లమెంటరీ కాంగ్రెస్ నేతలతో సమీక్షలు కొనసాగుతాయి. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత నరసారావుపేట, బాపట్ల, గుంటూరు, మచిలీపట్నం, ఏలూరు, నరసాపురం, రాజమండ్రి, తిరుపతి, చిత్తూరు, రాజంపేట పార్లమెంటు పరిధిలోని నేతలతో షర్మిల భేటీ అవుతారు. 21వ తేదీన అరకు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అమలాపురం, విజయవాడ పార్లమెంటు పరిధిలోని పార్టీ నేతలతో షర్మిల సమీక్షలు చేపడతారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తారు.

మోదీ సర్కార్‌కు ముప్పు ఉందా?

కాంగ్రెస్ వ్యాఖ్యల వెనుక మర్మమేంటి?

న్యూఢిల్లీ: కేంద్రంలో వరుసగా మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరింది. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టారు. ఎన్డీయే మిత్రపక్షాలకు 292 మంది ఎంపీల బలం ఉంది. బీజేపీకి సొంతంగా 240 మంది ఎంపీలున్నారు. ఎన్నికలకు ముందే బీజేపీ మరికొన్ని పార్టీలతో కలిసి ఎన్డీయే కూటమిగా బరిలోకి దిగింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సొంతంగా తమకు 300కు పైగా సీట్లు వస్తాయని బీజేపీ ఆశించింది. కానీ ఫలితం భిన్నంగా వచ్చింది. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం బీజేపీకి రాకపోయినప్పటికీ... ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో ఉండాలని ప్రజలు తీర్పునిచ్చారు. ప్రధానమంత్రిగా మోదీ అభ్యర్థిత్వానికి ఎన్డీయే భాగస్వామ్యపక్షాలు సరేనన్నాయి. దీంతో మోదీ వరుసగా మూడోసారి ప్రధాని అయ్యారు. మరోవైపు బీజేపీకి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం లేదని, మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడం అనైతికమని కాంగ్రెస్‌తో పాటు ఇండియా ఐక్యసంఘటనలోని భాగస్వామ్యపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఓ అడుగు ముందుకేసి మోదీ ప్రభుత్వం మైనార్టీలో ఉందని, ఎప్పుడైనా కూలిపోవచ్చని చెబుతున్నారు. అదే సమయంలో ఈ ప్రభుత్వం కూలిపోవాలని తాము కోరుకోవడం లేదని చెప్పారు. ఎన్నికలకు ముందే ఎన్డీయే కూటమిగా ఏర్పడి ప్రజల ముందుకెళ్లడంతో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ సీట్లు కూటమికి వచ్చాయి. దీంతో ఎన్డీయే సర్కార్ ఏర్పడింది. కానీ ఇండియా ఐక్యసంఘటన విమర్శల వెనుక అసలు కారణంపై రాజకీయ విశ్లేషకులు రకరకాల విశ్లేషణలు చేస్తున్నారు. టీడీపీ, జేడీయూతో పాటు మరికొన్ని ఎన్డీయే భాగస్వామ్యపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు తమ మద్దతు ఉపసంహరించుకుంటే మోదీ ప్రభుత్వం కూలిపోవడానికి అవకాశం ఉంటుంది. కానీ ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకున్న కారణంగా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు ఇప్పటికిప్పుడు మద్దతు ఉపసంహరించుకునే అవకాశాలు లేవని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. ఎన్డీయే కూటమిలో బీజేపీకి 240 మంది ఎంపీలు ఉన్నారు. ఇండియా ఐక్యసంఘటనలో అతిపెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్‌కు 99 మంది ఎంపీలు ఉండగా... మహారాష్ట్రకు చెందిన కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీ ఒకరు ఆ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ బలం వందకు చేరింది. అధికారం చేపట్టాలంటే కాంగ్రెస్‌కు మరో 172 మంది ఎంపీల బలం అవసరం. ఎన్డీయే కూటమిలో ఉన్న పార్టీల మద్దతు లేకుండా కాంగ్రెస్ అధికారం చేపట్టడం కష్టం. ఇండియా ఐక్యసంఘటన అధికారంలోకి రావాలంటే ఆ పార్టీలో ఇప్పుడున్న భాగస్వామ్య పక్షాలకు కలిపి 233 మంది ఎంపీల బలం ఉంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే మరో 39 మంది ఎంపీల మద్దతు అవసరం. టీడీపీ, జేడీయూకు చెందిన ఎంపీల సంఖ్య కలిపినా 'ఇండియా' సంఖ్య 261కి చేరుతుంది. ఇంకా 12 మంది ఎంపీల మద్దతు అవసరం. మరో మూడు నుంచి నాలుగు పార్టీలకు చెందిన మద్దతు 'ఇండియా'కు అవసరం. ఇన్ని పార్టీల కలయికతో ప్రభుత్వం ఏర్పడినా ఎన్నిరోజులు పాలన కొనసాగిస్తుందనే విషయం అనుమానమే. ఈ క్రమంలో మోదీ ప్రభుత్వానికి ప్రస్తుతం వచ్చిన నష్టం ఏమీ లేదని, ఎన్డీయే ప్రభుత్వానికి అవసరమైన మెజార్టీ ఉందనే విషయాన్ని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. వాస్తవం ఏమంటే ఇండియా ఐక్యసంఘటనకు చెందిన కొందరు ఎంపీలను బీజేపీ ఆకర్షించే అవకాశం ఉందనే అనుమానంతోనే కాంగ్రెస్ నేతలు మోదీ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుందని, మైనార్టీలో ఉందనే ప్రచారం చేస్తున్నారన్న అభిప్రాయం ఉంది. కాంగ్రెస్ పార్టీతో పాటు ఇండియా ఐక్యసంఘటనలోని పార్టీలు తమ ఎంపీలు పార్టీ మారకుండా ఉండేందుకు ఈ ప్రచారానికి కాంగ్రెస్ తెరలేపిందనే చర్చ నడుస్తోంది.

ఉరేసుకొని ఐఐటీ విద్యార్థిని ఆత్మహత్య

కోల్‌కతా: ఖరగ్‌పూర్ ఐఐటీలో నాలుగో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని హాస్టల్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కేరళకు చెందిన దేవికా పిళ్లై (21) బయోటెక్నాలజీ విభాగంలో నాలుగో సంవత్సరం చదువుతోంది. ఆమె సరోజినీ నాయుడు హాస్టల్ హాల్ పైకప్పుకు ఉరివేసుకుని కనిపించింది. దీంతో హాస్టల్ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని కిందికి దింపి పోస్టుమార్టం నిమిత్తం ఖరగ్‌పూర్ సబ్ డివిజనల్ ఆసుపత్రికి తరలించారు. పోస్టమార్టం నివేదిక వచ్చిన తర్వాత తాము మరిన్ని వివరాలను అందిస్తామని కాలేజీ యాజమాన్యం తెలిపింది. ఈ ఘటన ఆత్మహత్యా కాదా అని తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దేశవ్యాప్తంగా బక్రీద్ వేడుకలు

న్యూఢిల్లీ: బక్రీద్ పండుగ వేళ దేశవ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు. దేశంలోని అన్ని మసీదులు ముస్లిం సోదరులతో కళకళలాడాయి. పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ ముస్లింలు సంబరాలు చేసుకున్నారు. ఢిల్లీలోని జామా మసీదు వద్దకు పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు తరలివచ్చారు. ఈద్‌గా దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీలంపూర్ ఉమర్ మసీదు, ఫతేపురి మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. హైదరాబాద్‌లో కూడా పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు మక్కా మసీదుకు తరలివచ్చి ప్రార్థనలు చేశారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలకు ప్రధాని నరేంద్రమోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుభాకాంక్షలు తెలిపారు.

కరెంటు షాక్ ఇచ్చి... కొట్టి చంపారు

దర్శన్ అభిమాని హత్య కేసులో వెలుగుచూస్తున్న వాస్తవాలు

బెంగళూరు: కర్నాటకలోని నటుడు దర్శన్ అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. హత్యకు ముందు అతడిని చిత్ర హింసలకు గురిచేసినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. అతడికి కరెంటు షాక్ ఇచ్చినట్లు తేలింది. ఇటీవల అరెస్టు చేసిన కేబుల్ వర్కర్ ధన్‌రాజ్‌ను విచారించగా ఈ విషయాలు బయటకు వచ్చాయని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. దర్శన్ హత్య కేసులో నిందితులను విచారిస్తున్న పోలీసులు... మాండ్యాకు చెందిన ధన్‌రాజ్ అనే ఓ కేబుల్ వర్కర్‌ను ఇటీవల అరెస్టు చేశారు. నందీశ్ అనే వ్యక్తి తనను బెంగళూరులోని ఓ గోడౌన్‌కు తీసుకెళ్లాడని చెప్పాడు. అక్కడే రేణుకాస్వామికి ఎలక్ట్రికల్ మెగ్గర్‌తో కరెంటు షాక్ ఇచ్చేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఆ పరికరాన్నీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, పట్టణగెరెలోని షెడ్డులోనే బాధితుడిని చిత్రహింసలకు గురిచేశారని పోలీసులు గుర్తించారు. తాను శాకాహారినని చెప్పినా బలవంతంగా బిర్యానీ, ఎముకను నోట్లో పెట్టి తినిపించారని తెలిసింది. అనంతరం అతడిపై పవిత్రా గౌడ, దర్శన్‌తోపాటు ఇతరులు దాడి చేసినట్లు సమాచారం. మొత్తంగా బాధితుడి శరీరంపై 39 గాయాలుండగా... వీటిలో ఏడు, ఎనిమిదిచోట్ల కాలిన గాయాలున్నాయని పోలీసులు గుర్తించారు. రేణుకాస్వామిపై మొదట పవిత్రాగౌడ దాడి చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. తనను కొట్టవద్దని, మరోసారి ఈ తప్పు చేయనని ఆమె కాళ్లపై పడి వేడుకొన్నా... ఆమె కొట్టిందని నిందితులు వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. పవిత్ర, దర్శన్‌తోపాటు ఇతర నిందితులు వాడిన వస్తువులతోపాటు దుస్తులనూ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దుస్తులపై ఉన్న రక్తం మరకలను ఫోరెన్సిక్ పరీక్షకు పంపించారు. మరోవైపు హత్య అనంతరం రేణుకాస్వామి ఒంటిపై ఆభరణాలను నిందితులు దోచుకున్నట్లు తెలుస్తోంది. హత్య జరిగిన సమయంలో పవిత్ర మేనేజర్ దేవరాజ్ కూడా ఘటనా స్థలంలోనే ఉన్నాడని తేలడంతో... అతడిని కూడా పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు.

విశాఖ పోర్టుకు అంతర్జాతీయ ర్యాంకులు

కంటైనర్ పనితీరు సూచీలో 19వ స్థానం

ప్రపంచ బ్యాంకు సూచీలో కంటైనర్ పోర్టుకు 20వ స్థానం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ప్రపంచ బ్యాంకు నిర్వహించిన కంటైనర్ పోర్టు పనితీరు సూచికలో విశాఖపట్నం పోర్టు 20 స్థానంలో (సూచిక పాయింట్ 62.29), కంటైనర్ పోర్టు పనితీరు సూచీలో 19వ స్థానంలో నిలిచి రెండు రికార్డులను నెలకొల్పింది. ఈ విజయం ప్రపంచ వాణిజ్యంలో విశాఖపట్నం పోర్టు పనితీరును తెలుపుతోంది. కంటైనర్ పోర్టు పనితీరు సూచీలో తనకున్న విశేష అవకాశాలను అందిపుచ్చుకుని 2022లో ఉన్న 122వ స్థానం నుంచి ఏకంగా 102 స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి చేరుకుంది. అంతకుముందు ఏడాదిలో పోర్టు గణనీయమైన పురోగతికి, అభివృద్ధికి ఇదొక మైలురాయిగా నిలుస్తోందని పోర్టు ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. పనితీరు సూచీలలో పెరుగుదల పోర్టు పని సామర్థ్యం, పెట్టుబడులు, నూతన సాంకేతిక అంశాలు, పోర్టు నిర్వహణలో అమలు చేసిన అద్భుతమైన పనులను చూపెడుతోంది. పోర్టు అమలు చేసిన ఈ వ్యూహాత్మక పనులు పోర్టు సూచీల పెరుగుదలకు మాత్రమే కాకుండా ప్రపంచ సముద్రయాన రంగంలో పోటీని తట్టుకుని నిలబడదానికి అవసరమైన బలాన్ని పోర్టుకు అందించింది. పెరిగిన ర్యాంకింగ్ స్థానికంగాను, అంతర్జాతీయంగాను, వాణిజ్య వృద్ధిలో, వ్యాపార అవకాశాలు కల్పించడంలో పోర్టు ప్రాధాన్యతను తెలియజేస్తోంది. పోర్టులో పెరిగిన పని సామర్థ్యం కారణంగా సరుకు రవాణాలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేయడమే కాకుండా వ్యాపార అవకాశాలను పెంపొందించి దేశ వాణిజ్యాభివృద్ధిలో తనదైన ముద్రను వేయనుంది. పోర్టు సాధించిన ఈ ఘనత పోర్టు వ్యూహాత్మక దృష్టిని, నిర్వహణా సామర్థ్యాన్ని సూచించడమే కాకుండా భవిష్యత్తు అభివృద్ధికి, విజయానికి బలమైన పునాది వేస్తుంది. పోర్టు చైర్ పర్సన్ డా.ఎం.అంగముత్తు మాట్లాడుతూ పోర్టు సాధించిన ఈ ఘనత పట్ల గర్వంగా ఉందని, పోర్టు సిబ్బంది కష్టించే తత్వం, వారి అంకితభావం నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు. ఉన్నత ప్రమాణాలతో పని చేయడం ద్వారా వ్యాపార భాగస్వాములకు మరింత సేవలు అందించడానికి కృషి చేస్తామని తద్వారా ప్రపంచ పటంలో విశాఖ పోర్టును ఉన్నతంగా నిలిపేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ ఏడాది 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు 10 లక్షల మొక్కలను నాటాలనే లక్ష్యాన్ని విధించుకున్నామన్నారు. దీని ద్వారా సరుకు రవాణాను పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు సెమ్స్, ఐఎంయూ ద్వారా పోర్టు ఉద్యోగులకు, స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందిస్తున్నామన్నారు. పర్యావరణం, ఆరోగ్యం, సురక్ష విభాగంలో అత్యద్భుతమైన పనితీరు కనబరచినందుకుగాను 2022-23 ఏడాదికి గ్రీన్ టెక్ ఫౌండేషన్ విన్నర్ అవార్డు కోసం సిఫార్సు చేసిందన్నారు. ఈ వివరాలను పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.